## ఘనంగా నల్ల, ఎర్రపోచమ్మల ఆలయ వార్షికోత్సవం



**ఘట్‌కేసర్ రూరల్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** పోచారం మున్సిపల్ అన్నోజిగూడలోని నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ ఆలయ వార్షికోత్సవ పూజలు శుక్రవారం ఘనంగా ప్రారంభమైనాయి. నల్ల పోచమ్మ, ఎర్ర పోచమ్మ, నల్లమ హాంకాళి, ఈదమ్మ ఆలయాల వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా హోమం పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా చైర్మన్ బి. కొండల్ రెడ్డి పాల్గొని పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నానావత్ రెడ్యానాయక్, కౌన్సిలర్లు సింగిరెడ్డి సాయిరెడ్డి, నల్లవెల్లి లక్ష్మీశేఖర్, ఆలయ కమిటీ సభ్యులు పోలగోని వెంకటస్వామి, డి.శ్రీనివాస్, జితేందర్ నాయక్, నల్లవెల్లి రమేశ్, కొంతం శంకర్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్ వార్త

## పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలి

**కొడంగల్, ఆగస్టు 2ప్రభాతవార్త** కొడంగల్ అంబేద్కర్ చౌరస్తాలో ప్రజా సంఘాల ప్రతినిధులు నిర్వహించే కార్య క్రమాలకు పోలీసుల అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని హెడ్‌కానిస్టేబుల్ శివరాము లుగౌడ్ సూచించారు. శుక్రవారం ఆయన మాట్లాడుతు అంబేద్కర్ చౌరస్తాలో ఏ కార్యక్రమం జరుపాల నుకున్నా కొడంగల్ పోలీసు వారికి విధిగా ముందస్తు సమాచారం అందించాలని పేర్కొన్నారు. కొడంగల్ చౌరస్తాలో ట్రాఫిక్ నిబంధనలను పాటించకుండా ప్రజా సమూహం ఏర్పడితే ట్రాఫిక్ అంతరాయం జరిగే అవకాశం ఉందని, పోలీసు వారి అనుమతి తీసుకున్నచో ట్రాఫిక్ అంతరాయం జరరుగకుండా ఎలాంటి అవాంఛనీయ సంఘనటలు జరుగకుండా ప్రజా సంఘాల కార్యక్రమాలు పాలాభిషేకాలు, మహనుభావులు బాబాసాహెచ్ అంబేద్కర్‌కు పూలదండ అవిష్కరణలు తదితర కార్యక్రమాలు చేస్తే విధిగా పోలీసులకు ముందస్తు సమాచారం అందించి అనుమతి తీసుకుంటే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తు ఏర్పాటు చేస్తామని చెప్పారు.



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎంపిడివో రవిచంద్రకుమార్‌రెడి  పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు

## మానవ అక్రమ రవాణాను నిర్మూలించడం అందరి బాధ్యత

### ఎంపిడివో రవిచంద్ర కుమార్‌రెడ్డి

**కేశంపేట, ఆగస్టు 2, ప్రభాతవార్త** ప్రజల స్వచ్ఛంద సంస్థ హైదరాబాద్ మరియు మహిళా శిశు సంక్షేమ శాఖ షాద్‌నగర్ ప్రాజెక్టు ఆధ్వర్యంలో అంగన్ వాడీ టీచర్లకు రెండు రోజుల శిక్షణ కార్యక్రమం కేశంపేట మండల కేంద్రంలోని ఎంపిడివో కార్యాలయం సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపిడివో చంద్రకు మార్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడివో మాట్లాడుతూ మనుష్యుల అక్రమ రవాణా నిర్మూలనతో ప్రజలందరూ భాగస్వాములు కావాలని మానవ అక్రమ రవాణా అనేది ప్రపంచంలోనే 3వ అతిపెద్ద నేరమని ప్రతిరోజు ఎంతో మంది అమ్మాయిలు, మహిళలు దీని బారిన పడుతున్నారన్నారు. ముఖ్యంగా పెద మధ్యతరగతి వారు ఉద్యోగం ప్రేమ పెళ్లి సినిమా అవకాశాల పేరుతో మోసాలకు గురి అవుతున్నారు. ప్రతి ఒక్కరు దీనిపై అవగాహన పెంచుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ కోఆర్డినేటర్ సురేష్ కుమార్ మాట్లాడుతూ మానవ అక్రమ రవాణా నిర్మూలన కొరకు ప్రజ్వల సంస్థ గత 28 సంవత్సరాలనుంచి లైంగిక వ్యాపారానికి వ్యతిరేకంగా పని చేస్తూ 28,600 మంది అమ్మాయిలను కాపాడి వారికి పునరావాసం కల్పించడం జరిగిందని అన్నారు. ఈ సంస్థ వ్యవస్థాపకులు పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ సునీత కృష్ణన్ మాట్లాడారు. ఈ శిక్షణ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్ వైజర్లు దివ్య శమంతకమణి, ప్రజ్వల ప్రతినిధులు అనిల్ కుమార్ అంబర్ సింగ్ మితాళిరాజ్ మరియు మండలాలలోని అంగన్ వాడీ టీచర్స్ తదితరులు పాల్గొన్నారు.

## 6న జాబ్‌మేళా

### మేడ్చల్ జిల్లా ఉపాధికల్పన అధికారి రాధిక

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 2, ప్రభాతవార్త**

మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా పరిధిలోని అల్వాల్ ప్రభుత్వ ఐటిఐ ప్రాంగణంలో ఈ నెల 6వ తేదీన జాబ్ మేళా జరుగుతుందని, జిల్లాకు చెందిన నిరుద్యోగులు జాబ్‌మేళాలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా ఉపాది కల్పన అధికారి ఎం.రాధిక కోరారు. 6న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం 2వరకు జాబ్‌మేళా అల్వాల్ ప్రభుత్వ ఐటిఐలో కొనసాగుతుందన్నారు. రిలయన్స్ జియో ఇన్ఫో కమ్ లిమిటెడ్‌లో జియో ఫైబర్ అసోసియేట్ పోస్టులకు ఇంటర్వ్యూలు జరుగనున్నట్లు ఆమె తెలిపారు. నిరుద్యోగులుగ ఉన్న యువతీ, యువకులు 18నుంచి30సంవత్సరాలలోపు ఉండాలని అన్నారు. టెన్త్, ఇంటర్, ఐటిఐ ఉన్న వారు జాబ్‌మేళాలో పాల్గొనవచ్చన్నారు. వేతనం 12,500రూపాయలు అలవెన్స్ కలిపి ఇవ్వటం జరుగుతుందని ఆసక్తి ఉన్న వారు డబ్ల్యు డబ్ల్యుడబ్ల్యు.ఎన్ఐసి.జిఒవి.ఇన్ పోర్టల్‌లో రిజిష్టర్ చేసుకుని జాబ్‌మేళాకు హాజరు కావాలన్నారు. హెచ్‌ఆర్ ప్రతినిధులచేత ఇంటర్వ్యూలు నిర్వహించబడుతాయన్నారు. ఇతర వివరాలకు ఫోన్‌నెంబర్లు 7386809422, 9866465024లను సంప్రదించవచ్చని జిల్లా ఉపాధి కల్పన అధికారి ఎం.రాధిక పేర్కొన్నారు.

## పంటల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలి : గోపాల్



ప్యాలమద్దిలో పంటలను పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

**కొడంగల్, అగస్టు 2ప్రభాతవార్త** రైతులు వ్యవసాయ పంటల వివరాలను వ్యవసాయాధికారుల దగ్గర అన్‌లైన్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ రైతులకు సూచించారు. శుక్రవారం ఏఈఓ రాజు రాథోడ్‌తో కలిసి మండల పరిధిలోని ప్యాలమద్ది గ్రామంలో రైతులు సాగు చేస్తున్న పంటలను వారు పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి గోపాల్ మాట్లాడుతు వ్యవసాయ పంటల సాగులో అధిక మోతాదులో రసాయనాలను పిచికారి చేయరాదని, సేంద్రీయ పద్దతిలో పంటలను సాగు చేయడం మేలు ఉంటుందన్నారు. సాగు చేస్తున్న పంటలను వ్యవసాయ అధికారుల వద్ద అన్‌లైన్‌లో పంటలను నమోదు చేసుకోవాలన్నారు. అలాగే చీడపీడలకు అధికారుల సూచనలు సలహాలు పాటించి తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను పొందాలని రైతులకు వివరించారు.

## ఎస్సీ వర్గీకరణను స్వాగతిస్తున్నాం

### లింగాల మహేందర్

**షాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టును స్వాగతిస్తున్నామని బీజేపీ దళితమోర్చా మండల అధ్యక్షులు లింగాల మహేందర్ అన్నా రు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ.... దేశంలో మరో జఠిలమైన సమస్యను మోడీ రాజ్యాంగ సవరణలు, కోర్టు కేసులు, వివాదాలు, వైషమ్యాలు లేకుండా మరో సుదీర్ఘ సమ స్యకు పరిష్కారం లభించిందన్నారు. దశాబ్దాలుగా వెనుకబడ్డ ఎస్సీ పేద కులాలకు ఈ చారిత్రాత్మక తీర్పు వల్ల న్యాయం జరుగుతుందన్నారు.


# అభివృద్ధి వేగవంతం

### 5న తాండూరుకు పొంగులేటి, కోమటిరెడ్డి, గడ్డం రాక

### రూ.220 కోట్ల పనులకు శంకుస్థాపన

### యేడాదిలోగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సన్నాహాలు

**ప్రభాతవార్త, వికారాబాద్ జిల్లా ప్రతినిధి :** కనీవినీ ఎరుగని రీతిలో సీఎం రేవంత్‌రెడ్డి జిల్లా అభివృద్ధి పథం వైపు అడుగులు వేస్తోంది. కొడంగల్ సహా తాండూరు, వికారాబాద్, పరిగి అసెంబ్లీ నియోజకవర్గాలు ప్రగతి పురోగతి సాధించనున్నాయి. సీఎం రేవంత్, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డితో సాన్నిహిత్యం ఉన్న తాండూరు శాసనసభ్యుడు బుయ్యని మనోహర్‌రెడ్డి నియోజకవర్గం అభివృద్ధికి దండిగా నిధులు తెచ్చారు. అందులో భాగంగా సుమారు 220 కోట్ల రూపాయల విలువైన అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయించనున్నారు. కేవలం శిలాఫలకాలకే కాకుండా కాంట్రాక్టర్లను సకాలంలో బిల్లులు చెల్లించి పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయించాలని పట్టుపడుతున్నారు. ఈనెల 5న మంత్రులు పొంగులేటి, కోమటిరెడ్డి సహా శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను తాండూరుకు ఆహ్వానించారు. ఈ విలువైన పనులకు శంకుస్థాపన చేయించనున్నారు. పదేండ్లుగా పెండింగ్‌లో ఉన్న వికారాబాద్ నుంచి తాండూరు ఆర్అండ్‌బి రహదారి విస్తరణ పనులకు ఎమ్మెల్యే మనోహర్ రూ. 110 కోట్ల అంచనాల మేరకు నిధులు మంజూరు చేయించారు. 2014లో మంత్రి మహేందర్‌రెడ్డి రూ.55 కోట్లు నుంచి మంజూరు చేయించి కొంత వరకు పనులు చేయించారు. సకాలంలో రోడ్డు పనులు పూర్తి చేయలేకపోయారు. దాంతో నిధులు రద్దు కావడంతో రోడ్డు పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. సుమారు 8 ఏండ్లుగా అప్పటి ప్రభుత్వం కాంట్రాక్టర్లకు బిల్లులు చెల్లించనందున పనులు ముందుకు సాగలేదు. ఫలితంగా ప్రభుత్వం పనులను రద్దు చేసింది. గతంలో మంత్రులు పలుమార్లు ఈ రహదారిపై సమీక్ష నిర్వహించినా ఫలితం లేకపోయింది. ప్రయాణికుల నుంచి తీవ్ర విమర్శలు వచ్చాయి. 2018, 2023 అసెంబ్లీ ఎన్నికల్లో వికారాబాద్, తాండూరు ఎమ్మెల్యేలపై ఈ రోడ్డు ప్రభావం కూడా చూపెట్టిందని రాజకయా విశ్లేషకులు అంటున్నారు. 2023 డిసెంబరులో ఎమ్మెల్యేగా గెలుపొందిన మనోహర్‌రెడ్డి అభివృద్ధిపై దృష్టి సారించడమే కాకుండా కాంట్రాక్టర్లు సకాలంలో పనులు పూర్తి చేసే విధంగా చర్యలు చేపట్టారు. తాండూరు నుంచి వికారాబాద్ రహదారికి రూ.110 కోట్ల నిధులు తెచ్చి నిర్ణీత కాలంలో పూర్తి చేయనున్నారు. దీంతో పాటు యాలాల మండలం కోకట్ వద్ద ఆర్అండ్‌బి రోడ్డుపై పాత వంతెన స్థానంలో కొత్త బ్రిడ్జీ నిర్మించనున్నారు. ఇందుకోసం రూ.30 కోట్ల అంచనాల మేరకు నిధులు మంజూరు చేయించారు. 1988లో ఎన్టీ రామారావు ముఖ్యమంత్రి హోదాలో బ్రిడ్జీకి శంకుస్థాపన చేశారు. నాలుగేండ్లకు బ్రిడ్జి పూర్తి కావడంతో ఈ ప్రాంతంలో రవాణా వ్యవస్థకు మోక్షం లభించింది. సుమారు 33 ఏండ్లుగా బ్రిడ్జికి చిన్న చిన్న మరమ్మతులు చేపట్టారు. ఒకవైపు బ్రిడ్జీ శిథిలావస్థకు చేరిందని పలుమార్లు ఎమ్మెల్యేలకు మొర పెట్టుకున్నా ఫలితం లేకపోయింది. తాజాగా మనోహర్‌రెడ్డి ఈ వంతెనకు నిధులు తీసుకువచ్చారు. తాండూరులో ఇప్పటి వరకు ఆర్అండ్‌బి అథితి గృహం నిర్మించలేకపోయారు. రూ.5 కోట్లతో ఖాంజాపూర్ గేటు వద్ద 4 సూట్ల గెస్ట్‌హౌజ్ నిర్మించనున్నారు. ఆధునిక వసతులతో కూడిన గెస్ట్‌హౌజ్‌ను యేడాదిలోగా పూర్తి చేయాలని యోచిస్తున్నారు. బషీరాబాద్ నుంచి జీవన్గి మీదుగా కరణ్‌కోట వరకు రూ.30 కోట్ల అంచనా వ్యయంతో లింక్ రోడ్డు నిర్మించనున్నారు. ఈ రహదారి పూర్తయితే అనేక గ్రామాలకు రవాణా వ్యవస్థ మెరుగు పడుతుంది. చాలా కాలంగా ప్రజలు రవాణా వ్యవస్థ లేక అవస్థలు పడుతున్నారు. వీటితో పాటు తాండూరు - చించోలి జాతీయ రహదారి బైపాస్ నుంచి తాండూరు పట్టణం మీదుగా గౌతాపూర్ వరకు ఆర్అండ్‌బి రోడ్డు విస్తరణ చేపట్టనున్నారు. పటిష్టమైన సిమెంట్ కాంక్రీట్ రోడ్డు, సెంట్రల్ లైటింగ్ సిస్టమ్, ఇరువైపులా డ్రైన్లు నిర్మించనున్నారు. ఈ పనులకు సుమారు 22 కోట్ల వ్యయం అవుతుందని అంచనా. ఇవనీ మంత్రుల చేతుల మీదుగా శంకుస్థాపన చేయించనున్నారు. తాండూరు మండలం జినుగుర్తి వద్ద విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రారంభోత్సవంతో పాటు యాలాల మండలం జుంటుపల్లి, తాండూరు మండలం చంద్రవంచ, పెద్దేముల్ మండలం కందనెల్లి వద్ద 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లకు శంకుస్థాపన చేపట్టనున్నారు. పట్టణంలోని గొల్లచెర్వు డ్రైన్‌కు రూ.3 కోట్లు, చెన్గేష్‌పూర్ రోడ్డురూ.1.60 కోట్లు మంజూరు చేశారు. తాండూరులో బసవణ్ణ కట్ట వద్ద వెజ్, నాన్‌వెజ్ మార్కెట్లకు శంకుస్థాపన చేయనున్నారు. బషీరాబాద్‌లో శిథిలావస్థకు చేరుకున్న ఆర్అండ్‌బి గెస్ట్‌హౌజ్ స్థానంలో కొత్త నిర్మాణం చేపట్టనున్నారు. ఇవే కాకుండా కేంద్ర పరిధిలోని అమృత్-2.0 నీటి సరఫరా పథకానికి శంకుస్థాపన చేయనున్నారు. తాండూరు అభివృద్ధి కోసం బుయ్యని బ్రదర్స్ శక్తివంచన లేకుండా కృషి చేస్తూ విమర్శలకు చెక్ పెడుతున్నారు.



సబ్‌స్టేషన్, వికారాబాద్ రహదారి(ఫైల్)



# ప్రజలకు అందుబాటులో కార్యాలయాలు ఉండాలి

### సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాన్ని తహసీల్దార్ కార్యాలయం పక్కన ఏర్పాటు చేయాలి

### మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్



మాట్లాడుతున్న మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్

**శామీర్‌పేట, ఆగస్టు 2, ప్రభాతవార్త** శామీర్‌పేట గ్రామంలో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాన్ని మండల తహసీల్దార్ కార్యాలయం పక్కనగల స్నేహ భవనంలో ఏర్పాటు చేయాలని లేకుంటే శామీర్‌పేట గ్రామపంచాయతీ పక్కన కొత్తగా నిర్మిస్తున్న భవన సముదాయంలోకి మార్చాలని మేడ్చల్ జిల్లా సిపిఐ కార్యదర్శి డిజి సాయిలుగౌడ్ ప్రభుత్వాన్ని కోరారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేసినట్లు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు ద్వారా ప్రభుత్వాన్ని కోరటం జరిగిందన్నారు. రాష్ట్ర రిజిస్ట్రేషన్లు అండ్ స్టాంప్స్ శాఖ సంబంధిత ఉన్నతాధికారులకు ఈ విషయంపై వినతిపత్రాలను అందజేశామన్నారు. దీనిపై మాజీ మంత్రి, మేడ్చల్ ఎమ్మెల్యే సిహెచ్ మల్లారెడ్డి కూడ ఈ విషయంలో పునరాలోచించాలని ప్రజలకు అందుబాటులో ఉండేచోటనే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంను ఏర్పాటు చేయాలని కోరటం జరుగుతుందన్నారు. అదే విధంగ మాజీ ఎమ్మెల్యేలు మైనంపల్లి హన్మంత్‌రావు, ఎం.సుధీర్‌రెడ్డిల, జిల్లాకు సంబంధించిన కాంగ్రెస్ నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్, పలువురు నాయకుల దృష్టికి తీసుకవెళ్లటం జరుగుతుందన్నారు. ..శుక్రవారం శామీర్‌పేట మండలంలోని అలియాబాద్ చౌరస్తా వద్ద విలేకరులతో ఆయన మాట్లాడుతూ శామీర్‌పేట సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంను 1996సంవత్సరం నుంచి ప్రైవేట్ బిల్డింగ్‌ల్లోనే అద్దెకు తీసుకుని కొనసాగిస్తున్నారన్నారు. అయితే శామీర్‌పేట దర్గా చౌరస్తా సమీపంలోకి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంను మార్చాలని చూస్తున్నారని, అక్కడకు మారిస్తే అక్కడ ఖాళీ స్థలం లేదని, పార్కింగ్ సమస్య ఏర్పడుతుందని, పక్కనే రాజీవ్‌రహదారి ఉందని, ప్రధాన దర్గా చౌరస్తా ఉండటం వల్ల పక్కన దాతల సహకారంతో నిర్మించిన భవనం ఉన్నందున అక్కడికి మారిస్తే రోడ్డు ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని అన్నారు. కొందరి కోసం సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంను మార్చటం సరికాదని, ప్రస్తుతం శామీర్‌పేట గ్రామంలో ఉన్న సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంను మండల తహసీల్దార్ కార్యాలయంకు మార్చాలని, ప్రభుత్వ భవనాలు ఉన్నాయని, షెటర్స్ కూడ అనుకూలంగ ఉన్నట్లు మండలంలోని అన్ని గ్రామాల వారికి సౌకర్యంగా ఉంటుందని ఆయన అన్నారు. మండల కార్యాలయం వద్ద ఒక వేళ ఏర్పాటు చేయకుంటే శామీర్‌పేటలో గ్రామపంచాయతీ నుంచి కొత్తగా నిర్మిస్తున్న నూతన భవన సముదాయంలోకి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలోకి మార్చాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంను వెంటనే షిఫ్ట్ చేయవద్దని, మండల కార్యాలయం వద్దనే ఏర్పాటు చేయాలని, లేదంటే జెఎసిగా ఏర్పడి రాజకీయ పార్టీలకు అతీతంగ పోరాటాలు చేస్తామని సాయిలుగౌడ్ స్పష్టం చేశారు. శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ ఎంపిపి పల్లె సీతరాములుగౌడ్ మాట్లాడుతూ గతంలో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు కోసం ముందుగానే మండల పరిషత్ వద్ద షెటర్స్ నిర్మించటం జరిగిందని, మండల ప్రభుత్వ కార్యాలయం వద్దనే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంను ఏర్పాటు చేయాలని, అందిరికి సౌకర్యంగ ఉంటుందని, పార్కింగ్ సమస్య కూడ ఉండదని ఆయన అన్నారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్‌కు కూడ మండల కార్యాలయం వద్ద సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేసినట్లు మాజీ ఎంపిపి సీతరాములుగౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రైతుసంఘం అధ్యక్షులు నిమ్మల నర్సింహ్మా, మండల సిపిఐపార్టీ కార్యదర్శి నరేంద్రప్రసాద్, మండల నాయకులు గాదె వెంకటేశ, ప్రకాశ్, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణంలో చిరు వ్యాపారులు సహకరించాలి

### ఆర్అండ్‌బి డిఈఈ రవీందర్‌కుమార్

**కొత్తూర్, ఆగస్టు 2, ప్రభాతవార్త :** కొత్తూర్ వై జంక్షన్ నుంచి దర్గా రోడ్డు వరకు నిర్మిస్తున్న నూతన రోడ్డు నిర్మాణంలో చిరు వ్యాపారులు సహకరించాలని ఆర్అండ్‌బి డీఈఈ రవీందర్‌కుమార్ శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో కోరారు. ఈసమావేశానికి గ్రామ పెద్దలు, వ్యాపారులు హాజరయ్యారు. రవీందర్‌కుమార్ మాట్లాడుతూ....రోడ్డు విస్తరణలో భాగంగా రోడ్డుకు ఇరువైపులా 75ఫీట్ల స్థలం అవసరమని తెలిపారు. ఈస్థలంలో రోడ్డు విస్తరించడమే కాకుండా ఇరువైపులా డ్రైనేజి డివైడర్ నిర్మించాలని తెలిపారు. ఈ రోడ్డు విస్తరణలో జడ్పీహెచ్‌ఎస్ ప్రహరీకి అనుకుని వేసిన డబ్బాల వల్ల కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. వ్యాపారులు ఈ డబ్బాలు నమ్ముకుని జీవనోపాధి కొనసాగిస్తున్నారని, ఇలాంటి పరిస్థితిలో వారికి ప్రత్యామ్నాయం చూపాలని లేదా తమ డబ్బాలను విడిచిపెట్టి మిగిత స్థలంలో రోడ్డును నిర్మించాలని కోరారు. మున్సిపాలిటీ పెద్దలు మాట్లాడుతూ.... వ్యాపారులకు నష్టం జరగకుండా రోడ్డు నిర్మాణాన్ని పూర్తి చేయాలన్నారు. వ్యాపారులు తమ ఇబ్బందులను అధికారులకు వివరించారు. తమ డబ్బాలు తొలగించడం వల్ల తాము నష్టపోతామని, వారికి ప్రత్యా మ్నాయం చూపితే మాత్రవమే సహకరించగలమని తెలిపారు. ఈసమస్య లను పరిష్కరించేందుకు గ్రామ పెద్దలు, మున్సిపాలిటీ పెద్దల సహకారంతో చర్యలు తీసుకుంటామన్నారు. అంతిమంగా రోడ్డు విస్తరణను ప్రజలందరి సహకారంతో పూర్తి చేసి గ్రామాభివృద్ధి చేయాలన్నారు. ఈకార్యక్రమంలో మున్సిపాల్ కమిషనర్ బాలాజీ, పట్టణ పెద్దలు దేవేందర్‌యాదవ్, జె.సుదర్శన్‌గౌడ్, వీరమోని దేవేందర్‌ముదిరాజ్, గోపాల్‌గౌడ్, మాదారం నరసింహ్మాగౌడ్, జనార్దన్‌చారి, బ్యాగరి యాదయ్య, గ్రామస్థులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న రవీందర్‌కుమార్



ఊరేగింపుగా బోనాలు తీసుకువెళ్తున్న రజక సంఘం నాయకులు

## ఘనంగా పోచమ్మతల్లి బోనాలు

**కుల్కచర్ల, ఆగస్టు 2, ప్రభాతవార్త** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండల కేంద్రంలో పోచమ్మ తల్లి బోనాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి గ్రామం నుం చి మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారికి నైవేద్యం సమ ర్పించారు. సాయంత్రం గ్రామ మహిళలందరూ ఊరేగింపుగా బోనాలు తీసుకుని చిన్న గేట్ దగ్గర కొలువై ఉన్న అమ్మ వారిని దర్శించుకుని మొకు ్కలు తీర్చుకున్నారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని అంగడి బజార్ ప్యాటగడ్డ పెద్దగేట్ కిందగిరి ప్రాంతాల్లో పండుగ వాతావరణం నెలకొంది. కుల్కచర్ల మండలం రజక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మోత్కూరు వెంకటేష్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు వివిధ పార్టీల నాయకులు మహిళలు చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లాలో ఆపరేషన్ ముస్కాన్

### 10వ విడతలో 173 మంది బాలకార్మికులకు విముక్తి : ఎస్పీ

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించడంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్ -10 విడుతలో జిల్లా వ్యాప్తంగా 173 మంది బాలలను గుర్తించి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చడానికి జిల్లా వ్యాప్తంగా ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాన్ని అన్ని శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించడం జరిగిందని జిల్లా ఎస్పీ నారాయణ రెడ్డి తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతం కోసం జిల్లాలో సబ్ డివిజన్‌ల వారీగా 3 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి జూలై 1 నుండి 31 వరకఉ నెల రోజుల పాటు ఆపరేషన్ ముస్కాన్ -10 కార్యక్రమాన్ని జిల్లా వ్యాప్తంగా నిర్వహించడం జరిగింది. ఇందులో 173 మంది బాలకార్మికులను గుర్తించాడమైనదని తెలిపారు. ఇందులో 151 మంది మగ పిల్లలు ,22 మంది బాలికలు ఉన్నారని తెలిపారు. 173 మంది బాలబాలికలలో 31 మంది ఇతర రాష్ట్రాలకు సంబంధించిన వారు ఉన్నారు. జిల్లా వ్యాప్తంగా చిన్న పిల్లలను పనిలో పెట్టుకున్న వారిపైన 15 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేయడం జరిగిందని తెలిపారు. బాలల హక్కులను కాపాడాల్సిన బాధ్యత మనందరిపైన ఉన్నదని, బాలకార్మిక వ్యవస్థ నిర్మూళన కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని కోరారు. అలాగే ఎవరైనా బాలలను పనిలో పెట్టుకున్నట్లు తెలిస్తే వెంటనే డయల్ 100కి ఫోన్ చేసి పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. సబ్ డివిజన్‌ల వారీగా వివిధ శాఖల అధికారులు సమన్వయంతో కలసి పని చేసి ఆపరేషన్ ముస్కాన్-10 ను విజయవంతం చేసిన ప్రత్యేక బృందాలు సభ్యులను ప్రతి ఒక్కరికి ఎస్పీ అభినందించారు.

## ప్రజల జీవనోపాధి మెరుగుపరిచేందుకు అధికారులు కృషి చేయాలి : కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్ జిల్లా ప్రతినిధి ప్రభాతవార్త :** స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో చేపట్టాల్సిన పనులపై శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో అధికారులతో జిల్లా కలెక్టర్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...ఆగస్టు 5వ తేది నుండి 9వ తేది వరకు స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో ప్రజల అవసరాలకు అనుగుణంగా పనులు చేపట్టాలన్నారు. ఐదు రోజుల పాటు రోజు వారిగా చేపట్టాల్సిన పనులపై దృష్టి సారించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్వయం సహాయక సంఘాలతో సమావేశాలు నిర్వహించి వారిని భాగస్వాములను చేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ తెలిపారు. ఇందులో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రత, సీజనల్ వ్యాధులు, ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ సుధీర్, అసిస్టెంట్ కలెక్టర్ ఉమా హారతీ, డిఆర్‌డిఓ శ్రీనివాస్, డిపిఓ జయసుధ, డిఎంహెచ్ఓ పల్వాన్ కుమార్, డిఇఓ రేణుకాదేవి, పంచాయతీరాజు ఇఇ ఉమేష్, పశుసంవర్ధక శాఖ అధికారి పూర్ణచంద్రరావు, మెప్మా పిడి రవి కుమార్, మున్సిపల్ కమిషనర్లు, తదితరులు పాల్గొన్నారు.

## తల్లికి మించిన దైవం లేదు



**అత్తాపూర్ ఆగస్టు2,ప్రభాతవార్త :** తల్లికి మించిన దైవం లేదు. అమ్మ పాలకు మించిన అమృతం లేదని నవమాసాలు గర్భంలో ఉండి అమ్మ నుండి అందుకొన్న తొలి వరమని ఐసిడిసి సూపర్ వేజర్ పద్మాజా,మెడికల్ ఆఫీసర్ వందన పేర్కొన్నారు.తల్లిపాల వారోత్సవాలో భాగంగా రాజేంద్రనగర్ సర్కిల్ శేర్లింగంపల్లి ప్రాజెక్టు మైలర్‌దేవ్ పల్లి సెక్టార్ బాబుల్ రెడ్డి నగర్,వినాయక నగర్ అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం టీచర్ కనకవ్వ అనిత వారి కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...బిడ్డకు తల్లిపాలు వలన ఎంతో ఉపయోగం ఉంటుందని తల్లి బిడ్డ ఇద్దరికి ఉపయోగమే బిడ్డ పుట్టిన గంట లోపే తల్లి పాలు ఇవ్వడం ప్రారంభించాలి.ఈ పాలు బిడ్డకు తొలి ఆహారం,బిడ్డ ఆరోగ్యంగా ఎదగడానికి తల్లి పాలె ముఖ్యంమన్నారు.ఈ విషయంలో చాలా మంది తల్లులు నిర్లక్ష్యం చేస్తున్నారు.ఫలితంగా పిల్లలు రక్తహీనత ఇతర వ్యాధుల తో బాధపడుతున్నారు.ఆధునిక సమాజంలో చాలా మంది బిడ్డకు పాలు ఇవ్వడం లేదు.కొంత మంది తల్లులు శారీరక సౌదర్యం తగ్గుతుందనే అపోహ చాలా మందిలో నేటికి ఉంది.దినిపై అవగాహన పెంచాలనే ఉద్దేశ్యంతో ఆగస్టు 1 నుండి 7వ తేదివరకు తల్లి పాల వారోత్సవాలు వైద్య ఆరోగ్య శాఖ నిర్వహిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కనకవ్వ,అనిత,కమ్యూనిటీ ఆర్గనైజర్ గౌరీ ఏఎన్ఎం ప్రేమాదేవి, భాగ్య, ఆశావర్కర్లు, సరిత,రేణుక మంగ,తదితరులు పాల్గొన్నారు.

### విద్యార్థుల మధ్య గొడవ..విద్యార్థికి గాయాలు

**అత్తాపూర్ ఆగస్టు 2,ప్రభాతవార్త :** రాజేంద్రనగర్ పరిధిలోని అత్తాపూర్ శ్రీ మేధ జూనియర్ కాలేజీలో ఇంటర్ విద్యార్థులు తోటి విద్యార్థిపై దాడి చేసి తీవ్రంగా గాయపర్చారు.కళశాల యాజమాన్యం వివరాల ప్రకారం.....ఇంటర్ సెకండ్ ఇయర్ చదువుతున్న విద్యార్థులు లంచ్ బ్రేక్ సమయంలో సరదాగా మరో విద్యార్థిని రౌండప్ చేసి కొట్టడంతో.ఆ విద్యార్థి గొడకు తగిలి తీవ్ర గాయలు అవ్వడంతో చికిత్స కోసం ఆస్పత్రికి తరలించామని తెలిపారు.దాడి విషయం తల్లిదండ్రులకు తెలపడంతో కళాశాలకు చేరుకొని కళాశాల ఎదుట ఆందోళనకు దిగారు. కొడుకుపై దాడిచేసి వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేయగా కళాశాల యాజమాన్యం బాధిత కుటుంబానికి అనుకొ కుండా జరిగిన గొడవ అన్ని నచ్చజెప్పడంతో గోడవ సదుమనిగింది.ఇలాంటివి మరోసారి జరగకుండా చూడాలని యాజమాన్యాన్ని కొరారు.

## 30ఏళ్ల సుదీర్ఘ పోరాటం నేరవేరింది

**- దళిత ఉపకులాల జర్నలిస్టులు సంబరాలు**



**అత్తాపూర్ ఆగస్టు 2,ప్రభాతవార్త :** ఎస్సీ రిజర్వేషన్లలో ఎబిసిడి లుగా వర్గీకరించుకోవచ్చని రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం అయిన సుప్రీంకోర్టు రాష్ట్రాలకు అవకాశం కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంపై రాజేంద్రనగర్ మాదిగ ఉపకులాల జర్నలిస్టులందరూ హర్షం వ్యక్తం చేశారు.శుక్రవారం రాజేంద్రనగర్ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.అనంతరం మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు చేసుకున్నారు.ఈ సందర్భంగా సీనియర్ జర్నలిస్టు భీమయ్య,వెంకటేష్‌లు మాట్లాడుతూ..ఎస్సీ వర్గీకరణ చేపట్టాలని గత 30 ఏళ్లుగా ఎమ్మార్పిఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు జాతీయ నాయకులు మంద కృష్ణ మాదిగ నేతృత్వంలో ఎన్నో అలుపెరుగని పోరాటాలు జరిగాయన్నారు.సుప్రీంకోర్టు ఆదేశానుసారం రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఎబిసిడి వర్గీకరణ చేపట్టి 59 మాదిగ మాల ఉపకులాలకు మేలు చేకూర్చాలని వారు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.ప్రతి మాదిగ మాల ఉపకులాల విజయమన్నారు.ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు బాలసుబ్రమణ్యం ,వెంకటేష్, నరసింహ, అంజిబాబు,శ్రీకాంత్,రవి కుమార్,రాజు,రామకృష్ణ,ఉన్నారు.

### శ్రామిక మార్గం మాసపత్రిక ఆవిష్కరణ..


**జగద్గిరిగుట్ట, ఆగస్ట్ 2, ప్రభాతవార్త**

జగద్గిరిగుట బస్‌స్టాండ్ అంబేద్కర్ విగ్రహం వద్ద శ్రామికమార్గం మాసపత్రికను ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శుక్రవారం ఆవిష్కరించడం జరిగింది. మున్సిపల్ మహిళా కార్మికులు గీతా నాయక్, బిక్లి నాయక్, పుష్పా, దాస్లి, అలివేలులు ఆవిష్కరించి కమ్యూనిస్టు పార్టీ ఆఫ్ ఇండియా (సిపిఐ) రాష్ట్ర నాయకులు ఏసురత్నం, సిపిఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఏసురత్నం మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమకారుడు, కవి రచయిత మోహన్ బైరాగి సంపాదకుడుగా వెలువడుతున్న శ్రామిక మార్గం మాసపత్రికను భవన నిర్మాణ కార్మికులు, మున్సిపల్ కార్మికులు వేలాది శ్రామిక ప్రజలు నివసించే జగద్గిరిగుట్టలో మున్సిపల్ మహిళా కార్మికుల చేతుల మీదుగా ఆవిష్కరించడం అభినందనీయమని అన్నారు. సిపిఐ మేడ్చల్ జిల్లా సహాయ కార్యదర్శి ఉమా మహేష్ మాట్లాడుతూ గత ముప్పై ఏళ్లుగా కవిగా రచయితగా మోహన్ బైరాగి ఆధ్వర్యంలో నడుస్తున్న శ్రామిక మూర్గం మాసపత్రిక మరింత అభివృద్ధి చెంది శ్రామిక జన పక్షపాతిగా తన ప్రయాణం కొనసాగాలని ఆకాంక్ష వ్యక్తం చేశారు. పత్రిక అభివృద్ధికి తనవంతు సహాయ సహకారాలు ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో హరినాథ్‌రావు, రాములు, ప్రవీణ్, ప్రభాకర్, ఆవుల నాగరాజు, వెంకటేశ్వరరావు, ప్రవీణ్, వెంకటేష్, సోమయ్య, జర్నలిస్టులు డప్పు రామస్వామి, వెంకట్ మున్సిపల్ వర్కర్లు, అసంఘటిత రంగ కార్మికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన వారందరికి మోహన్ బైరాగి ధన్యవాదాలు తెలిపారు.

### కొంపల్లి పురపాలక సంఘం పరిధిలో డ్రైడే

**కొంపల్లి, ఆగస్ట్ 2, ప్రభాతవార్త**

కొంపల్లి పురపాలక సంఘం పరిధిలో శుక్రవారం వివిధ వార్డుల్లో డ్రైడే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ సిబ్బంది వివిధ వార్డుల్లో కుండీలు, నిరుపయోగంగా ఉన్న బిందెల్లో నిలిచిపోయిన నీటిని తొలగించడం, మురికి ప్రదేశాలను పరిశుభ్రం చేసి బ్లీచింగ్ పౌడర్, రసాయనాలను స్ప్రే చేశారు. దోమల ఉత్పత్తిని నిరోధించడానికి ఆయిల్ బాల్స్‌లను నీరు నిల్వ ఉన్న ప్రదేశాలలో వేశారు. ఇతర పరిశుభ్రత కార్యక్రమాలపై దృష్టి సారించి ప్రజలకు అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ కె.శ్రీహరి, కౌన్సిల్ సభ్యులు, కోఆప్షన్ సభ్యులు, రెసిడెన్షియల్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నగరంలో జరిగిన ఫ్యాషన్ షోలో పాల్గొన్న మోడల్స్

## తెలంగాణ సంస్కృతిక సంప్రదాయాలకు ప్రతీకలు బోనాలు : కమిషనర్ కృష్ణ ఆదిత్య



బోనాలు ఉత్సవాల్లో పాల్గొన్న కార్మిక శాఖ కమిషనర్ కృష్ణఆదిత్య, అదనపు కమిషనర్ డాక్టర్ ఇ.గంగాధర్, జెసిఎల్ శ్యామ్‌సుందర్‌రెడ్డి తదితరులు

**చిక్కడపల్లి, ఆగస్టు 2ప్రభాతవార్త:** తెలంగాణ సంస్కృతిక సంప్రదాయాలకు ప్రతిబింబాలుగా బోనాలు ఉత్సవాలు నిలుస్తాయని రాష్ట్ర కార్మిక శాఖ కమిషనర్ కృష్ణ ఆదిత్య అన్నారు. శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్స్ కార్మిక శాఖ కమిషనర్ కార్యాలయం ఆవరణలో ఉన్న దుర్గానల్లపోచమ్మ అమ్మవారి దేవాలయంలో ఉద్యోగులు సుదీర్, శేఖర్, శ్రీనివాస్, రాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉత్సవాలకు కమిషనర్ కృష్ణఆదిత్య హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ డాక్టర్ ఇ.గంగాధర్, రాష్ట్ర సంయుక్త కమిషనర్ చంద్రశేఖరం, రంగారెడ్డి, హైదరాబాద్ జంట నగరాల జాయింట్ కమిషనర్లు శ్యామ్‌సుందర్‌రెడ్డి, సునీత, డిప్యూటీ కమిషనర్లు శ్యామ్‌సుందర్‌జాజు,శ్రీనివాస్‌గౌడ్, ప్రమోద్‌రెడ్డి, నీలమ్మ, రాజేంద్రప్రసాద్, చంద్రశేఖర్‌గౌడ్, అసిస్టెంట్ కమిషనర్లు సత్యనారాయణరెడ్డి, జసన్, వెంకటరెడ్డి, లేబర్ ఆఫీసర్ టి.శిరీష, ఇతర అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### సుప్రీం కోర్టు తీర్పుపై ఓ.యూ మాదిగ అధ్యాపకులు హర్షం



మాట్లాడుతున్న ఓ.యూ అధ్యాపకులు ప్రొ.గడ్డ మల్లేశం తధితరులు

**తార్నాక, ఆగస్టు 2 ప్రభాతవార్త:** ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై సుప్రీం కోర్టు వెలువరించిన తీర్పు పట్ల ఉస్మానియా యూనివర్సిటీ మాదిగ అధ్యాపకులు హర్షం వ్యక్తం చేశారు. ఓ.యూ ఆర్ట్స్ కాలేజ్‌లో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో యూజీసీ డీన్ ప్రొఫెసర్ మల్లేశం పాల్గొని మాట్లాడుతూ అత్యున్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పు సామాజిక న్యాయం చేకుర్చడానికి వచ్చిన తీర్పు అన్నారు. వర్గీకరణ కోసం అసువులు బాసిన అమర వీరుల ఆత్మలకు శాంతి చేకూరుతుందన్నారు. వర్గీకరణ కోసం పోరాడిన వారందరికి పేరు పేరున ధన్యవాదాలన్నారు. పీజీ ప్రవేశ పరీక్షల ఫలితాలు విడుధల కానున్న నేపథ్యంలో వర్గీకరణ పట్ల కోర్టు తీర్పు ప్రకారం సీట్లను భర్తీ చేసే విదంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రూప్ వన్ మెయిన్స్ ఇంటర్వ్యూలల్లో కూడ రిజర్వేషన్లు పాటించాలని విజ్ఞప్తి చేశారు. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలన్నారు. రిజర్వేషన్‌పై సానుకూలంగా స్పందించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలన్నారు. వెంటనే ఆర్గినెన్స్ తీసుకువచ్చి రిజర్వేషన్ ప్రక్రియను చేపట్టాలని కోరారు. జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్ల వర్గీకరణ చేసి అమలు చేయాలని ప్రొ. మల్లేశం కోరారు. ఈ కార్యక్రమంలో టెక్నాలజీ కళాశాల ప్రిన్సిపల్ ప్రొ.చింత సాయిలు, ప్రొ.కాశీం, ఓ.యూ ఛీఫ్ వార్డెన్ డా.కొర్రెముల శ్రీనివాస్, ప్రొ. డైసీ, డా. మేడి శ్రీనివాస్, డా. వంశీధర్ తధితరులు పాల్గొన్నారు.

### బ్రాహ్మణుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉంది

**-ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల అయిలయ్య**



ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల అయిలయ్యను కలిసిన తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు

**చిక్కడపల్లి, ఆగస్టు 2 ప్రభాతవార్త:**

బ్రాహ్మణుల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని, అందువల్లనే ఇటీవల ప్రకటించిన అసెంబ్లీ బడ్జెట్‌లో బ్రాహ్మణ సంక్షేమ పరిషత్‌కు సిఎం రేవంత్‌రెడ్డి రూ.50కోట్లు కేటాయించారని ప్రభుత్వ చీఫ్ విప్ బీర్ల అయిలయ్య తెలిపారు. బ్రాహ్మణుల డిమాండ్లను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళి బడ్జెట్‌లో పరిషత్‌కు నిధులు కేటాయించాలని తెలంగాణ బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య ఆధ్వర్యంలో బీరయ్య అయిలయ్య ఇచ్చిన డిమాండ్లను ప్రభుత్వం దృసుకెళ్ళి వాటిని అసెంబ్లీలో చర్చించి నిధుల కేటాయింపు చేసినందుకుగాను సమాఖ్య ప్రాంతీయ కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు శుక్రవారం ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో కలిసి సత్కరించారు. బీర్ల అయిలయ్య మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడానికి అన్నివర్గాల ప్రజల మద్దతు ఉందని, అదే తరహాలో బడ్జెట్‌లో అన్నివర్గాలకు సముచిత స్థానం కల్పించడం జరిగిందన్నారు. వక్కలంక శ్రీనివాస్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బ్రాహ్మణుల విదేశీ విద్యకు సంబంధించిన 800 మంది విద్యార్థులకు రూ.150 కోట్లను కూడా విడుదల అయ్యేలా చూడాలని కోరారు. అదే విధంగా జిల్లాల్లో బ్రాహ్మణ భవనాలు, వేద పాఠశాలలు, కల్యాణ భవనాలు, గోశాలల నిర్మాణానికి కూడా ప్రభుత్వం నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులు మంగపతిరావు, స్వరూప్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

### గురంపోడు నిర్వాసితులు పట్టాల కోసం 9న నిరసన ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న జయవింధ్యాల

**సైఫాబాద్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** ప్రపంచ ఆదివాసీ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సూర్యపేట జిల్లాలోని గురంపోడు నిర్వాసితుల భూములకు రాష్ట్ర ప్రభుత్వం పట్టాలను పంపిణి చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 9వ తేదీన బషీర్‌బాగ్‌లోని డా.బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహం ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహిస్తారని తెలంగాణ రాష్ట్ర పౌర హక్కుల ప్రజా సంఘం (పియుసిఎల్) అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బాలకిషన్‌రావు, జయవింధ్యాల, గురంపోడు భూ పరిక్షణ సమితి అధ్యక్షుడు బాలాజీనాయక్ తెలిపారు. 1959లో నాగార్జునసాగర్ ఆయకట్టు కింద నిర్వాసితులైన 350 గిరిజన కుటుంబాలకు సూర్యపేట జిల్లాలోని సర్వే నెంబరు 540లో ప్రభుత్వం ఇళ్ళను నిర్మించి, వ్యవసాయ భూములుగా 1832 ఎకరాలు కేటాయించిందని ఆనాటి నుంచి నేటి వరకు నిర్వాసితులకు పట్టా పాస్ పుస్తకాలు ఇవ్వకుండా అధికారుల దాటవేస్తున్నారని శుక్రవారం బషీర్‌బాగ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు ఆరోపించారు. ఆ సర్వే నెంబరులో 6200 ఎకరాల భూమి ఉందని, అందులో వివిధ రాజకీయ పార్టీల నాయకులకు చెందిన కుటుంబ సభ్యులు సిమెంట్ ఫ్యాక్టరీలు నెలకోల్పి మెల్ల, మెల్లగా భూములను అక్రమించుకో వడానికి ప్రయత్నిస్తున్నారని వారు ఆరోపించారు. గతంలో కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వ హాయంలో నాగార్జునసాగర్ ఆయకట్టు పనిపూర్తి అయ్యిందని, ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్నందున రాష్ట్ర మంత్రి అయిన సీతక్క స్పందించి ఈ గిరిజనులకు ఆమె చేతులు మీదగా పట్టా పాస్ పుస్తకాలను పంపిణి చేయాలని వారు కోరారు.

# బందీఖానాలో బాల్యం

**-పసి వయసులోనే పనులకు**

**-చదువు లేక ఎదగలేని పసివాళ్ళు పనివాళ్ళుగా మారుతున్నారు**

**-155 మంది శ్రమ దోపిడీ చేసే యజమానులు అరెస్ట్**

**హైదరాబాద్, ఆగస్ట్ 2, ప్రభాతవార్త:** బాల కార్మికులను, బిక్షమెత్తుకుంటున్న పసి పిల్లలను విముక్తుల్ని చేయడానికి ప్రతి ఏటా జనవరి, జూలై నెలల్లో నిర్వహించే ఆపరేషన్ ముస్కాన్, ఆపరేషన్ స్మైల్‌లను పోలీసు శాఖ ముమ్మరం చేసింది. ఇంటి నుంచి తప్పిపోయి, బిక్షమెత్తుకుంటూ, రోడ్డు మీద చెత్త ఏరుకుంటూ, వివిధ పనుల్లో శ్రమజీవులుగా అవస్థ పడుతున్న బాల కార్మికులను గుర్తించి దుర్భర పరిస్థితి నుంచి విముక్తి చేయడానికి ఆపరేషన్ ముస్కాన్-10 చేపట్టిన పోలీసు శాఖ వందల మంది పసిపిల్లలను బంధిఖానా నుంచి విముక్తుల్ని చేసింది. సైబరాబాద్ పోలీస్ కమీషనరేట్ పరిధిలో 651 మంది బాలకార్మికులకి, భిక్షాటన చేస్తున్న పసిపిల్లలకీ విముక్తి లభించగా, రాచకొండ కమీషనరేట్ పరిధిలో జరిగిన ఆపరేషన్ ముస్కాన్ ద్వారా 326 మంది పిల్లలు రక్షింపబడినట్లు సమాచారం. పిల్లలందరినీ చైల్డ్ వెల్ఫేర్ కమిటీ ఆధ్వర్యంలో వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చి బాల కార్మిక వ్యవస్థపై కౌన్సిలింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. ఎవరూ లేని బాలలకు పునరావాసం కల్పించి చదివించే విధంగా పోలీసులు చర్యలు తీసుకున్నారు. జూలై 1 నుంచి 31వ తేదీ వరకూ జరిగిన ఈ ఆపరేషన్‌లో హైదరాబాద్ వ్యాప్తంగా పిల్లలను పనిలో పెట్టుకున్నందుకు 155 మందికి పైగా నిందితులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిపై ఐపీసీ చైల్డ్ లేబర్ చట్టం, జువినైల్ జస్టీస్ చట్టం ప్రకారం కేసులు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. రాచకొండ పరిధిలో విముక్తి పొందిన 326 మంది బాలల్లో 208 మంది అబ్బాయిలు, 10 మంది ఆడ పిల్లలు ఉన్నట్లు పోలీసులు తెలిపారు. కాగా సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో రక్షింపబడ్డ బాలల్లో 11 మంది భిక్షాటనలో ఉన్నట్లు తెలిసింది. బాల కార్మిక వ్యవస్థను, గుట్టు చప్పుడు కాకుండా జరిగే బెగ్గింగ్ మాఫియాను అరికట్టేందుకు నగర వ్యాప్తంగా పోలీసులు వేరు వేరు బృందాలుగా విడిపోయి బంధిఖానా నుంచి బాలలను విముక్తుల్ని చేసి రక్షణా కేంద్రాలకు తరలిస్తున్నారు. పనికెళ్ళే పసిపిల్లలను గుర్తించే క్రమంలో నగర వ్యాప్తంగా మూడు కమీషనరేట్ల పరిధిలోనూ యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్(ఏహెచ్‌టీయు) విభాగంలోని పోలీసులతో పాటు, ఉమన్ ఎండ్ చైల్డ్ సేఫ్టీ వింగ్ బృందం, షీటీమ్ సాయంతో 20 పోలీసు బృందాలు విధి నిర్వహణలో బాల కార్మికుల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. కమీషనర్ అవినాశ్ మహంతి, కమీషనర్ జి.సుధీర్ బాబుల ఆధ్వర్యంలో ఈ రెస్క్యూ ఆపరేషన్ల నిర్వహణ జరిగింది. వివిధ పరిశ్రమల్లోనూ, కంపెనీల్లోనూ తనిఖీలు నిర్వహించిన పోలీసు బృందాలు, భిక్షమెత్తుకుంటున్న పిల్లలను 'దర్పణ్ యాప్' సాయంతో ట్రేస్ చేసినట్లు తెలిపారు. మానవుల అక్రమ రవాణా మీద కూడా ఏహెచ్‌టీయు బృందాలు ఉక్కు పాదం మోపనున్నట్లు పేర్కొన్నారు. బాల కార్మికులు, భిక్షాటన చేసే పిల్లలు ఎవరికైనా కనిపించినా, మానవుల అక్రమ రవాణా జరుగుతున్నట్లు తెలిసినా తక్షణమే పోలీసులకు సమాచారమిచ్చే క్రమంలో 1 0 0 కు గానీ, 1 0 9 8 కు గానీ, 9490617444 కు గానీ డయల్ చేసి సమాచారమందించమని తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్‌లో భాగంగా ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

**బాల్యాన్ని ఛిదిమేస్తున్న శ్రమ దోపిడీదారులు :**

తక్కువ జీతంతో ఎక్కువ చాకిరీ చేయించుకునే నెపంతో శ్రమ దోపిడీ చేసే యజమానులు చట్ట వ్యతిరేకంగా బాలకార్మిక వ్యవస్థను పెంచుతున్నారు. బాల కార్మికులను పనుల్లో పెట్టుకుంటే అధిక వేతనాలివ్వక్కర్లేదనే ఒకే ఒక్క కారణంతో పలువురు యజమానులు పక్క రాష్ట్రాల నుంచి వలస తెచ్చుకుంటున్నారు. ఇళ్ళు, హోటళ్ళు, బిల్డింగ్ పనులు, బ్యాకరీలు, కిరాణా దుకాణాలు, ఇటుకబట్టీలు, మెకానిక్ షెడ్లు తదితర పరిశ్రమల్లో పిల్లలను 9 పని గంటల కంటే ఎక్కువ సేపు వెట్టి చాకిరీ చేయిస్తున్నారు. పేదరికం కారణంగా పిల్లల తల్లిదండ్రులు పసి వయసులోనే వారిని పనికి పంపుతున్నారు. ప్రతి నెలా వేతనంతో పాటు రోజూ భోజనం గడిచిపోతుండడంతో పిల్లలను పనులకు పంపేందుకు మొగ్గు చూపుతున్నారు. తద్వారా చదువు లేక ఎదగలేక పసివాళ్ళు పనివాళ్ళుగా మిగిలిపోతున్నారు. ఉత్తర ప్రదేశ్, ఒరిశ్శా, చత్తీస్‌ఘడ్, బీహార్, కర్ణాటక, మధ్యప్రదేశ్, రాజస్థాన్ మేఘాలయా వంటి వివిధ ప్రాంతాల నుంచి భాష తెలియని పక్క రాష్ట్రాలకు పిల్లలు వలస వెళ్తుండడంతో వారికి కనీస అక్షర జ్ఞానం కూడా లేకుండా పోతోంది. దాంతో వారి జీవితాల్లో ఎదుగుదల కరువై కూలి పనికే పరిమితమవుతున్నారు.

## కుటుంబ కలహాలతో వ్యక్తి దారుణ హత్య -నిందితుడు అరెస్ట్

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** కుటుంబ కలహాలతో వ్యక్తిని బండరాయితో తల పగలగొట్టి చంపిన దారుణ ఘటన రాజేంద్రనగర్ పోలీసు స్టేషన్‌లో గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం. రాజేంద్రనగర్ పరిదిలోని ఇందిరమ్మ కాలనీ ఎక్సైజ్ అకాడమీ వద్ద ఓపెన్ ప్లాట్ల ఖాళీ స్థలంలో గుర్తు తెలియని శవం ఉందని ఫిర్యాదు రావడంతో పోలీసులు ఘటనా స్థలికి చేరుకున్నారు. మృతుడిని మైకల వేణుబాబు అలియాస్ రేణుబాబు(35) గా గుర్తించారు. ఎవరో అతడిని తలపై బండరాయితో మోది హత్య చేసినట్లు తేలడంతో నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టారు. ఈ నేపథ్యంలో హత్యచేసిన దుండగుడు దవన్‌కర్ సాయి వర్షిత్(19)గా గుర్తించి అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి ఒక మోటర్ సైకిల్, రక్తపు మరకలైన చొక్కా, ఒక మొబైల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కుటుంబ కలహాల నేపథ్యంలో వేణుబాబును హత్య చేసినట్లు దర్యాప్తులో తేలింది. గురువారం అర్ధరాత్రి 12:00 గంటల సమయంలో వైన్ షాపుకు వెళ్ళిన నిందితుడు సాయి వర్షిత్, తన బంధువు వేణుబాబు తాగిన మైకంలో రోడ్డుమీద పడుండడం గమనించాడు. అతడిని ద్విచక్రవాహనంపై ఎక్కించుకుని దగ్గరలో ఉన్న ఖాళీ స్థలానికి తీసుకెళ్ళి చితకబాదాడు. అనంతరం అతడి తలపై బండరాయితో మోది అక్కడి నుంచి పరారయ్యాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేసి నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు.

### అనుమానంతో భార్యను అంతంమొందించిన భర్త

**-ఇనుప పానతో తలపై మోది దారుణ హత్య**

**సరూర్‌నగర్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** భార్య ప్రవర్తనపై అనుమానం పెంచుకున్న ఓ భర్త దారుణానికి పాల్పడ్డాడు. ఏకంగా ఇనుప పానతో భార్య తలపై మోది పాశావికంగా హత్య చేశాడు. ఈ దారుణ సంఘటన హైదరాబాద్ నగర శివార్లలోని మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. హస్తినాపురం సమీపంలోని అగ్రికల్చర్ కాలనీలోనున్న ఉషోదయ రెసిడెన్సీ అపార్ట్‌మెంట్‌లో బొల్లారం రాజు (47) అనే వ్యక్తి భార్య జ్యోతి, నాలుగు సంవత్సరాల కూతురుతో నివసిస్తున్నాడు. అయితే ఇటీవల నుండి ఆయన తన భార్యపై అనుమానం పెంచుకున్నాడు. ఈ క్రమంలో భార్యతో తరచుగా గొడవ పడుతున్నాడు. ఈ నేపథ్యంలో భార్యను అంతం చేయాలని నిర్ణయించుకున్న రాజు తన కూతురును అత్తింటికి పంపాడు. గురువారం ఉదయం భార్యతో గొడవ పడి ముందే తెచ్చి ఇంట్లో పెట్టుకున్న ఇనుప పానతో జ్యోతి తలపై మోదాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. అనంతరం నిందితుడు నేరుగా పోలీస్‌స్టేషన్‌కు వెళ్ళి లొంగిపోయినట్లు సమాచారం. అయితే హతురాలి తల్లి అలివేలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇన్స్‌పెక్టర్ నాగరాజు ఆధ్వర్యంలో కేసు నమోదు అయ్యి దర్యాప్తు జరుగుతున్నది.

## రాజీవ్ గృహకల్ప ఇండ్ల కబ్జా..

**-రెవెన్యూ మున్సిపల్ అధికారులకు విన్నవించిన చర్యలు లేవు..**

**-అధికారుల నిర్లక్ష్యం, అక్రమార్కుల దోపిడి : సిపిఎం**

**నిజాంపేట్, ఆగస్ట్ 2, ప్రభాతవార్త**

నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప కేటాయించని ఇండ్ల కబ్జాను అరికట్టాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులకు విన్నవించిన ఎటువంటి చర్యలు చేపట్టడంలేదని, అధికారుల నిర్లక్ష్యం అసలైన లబ్ధిదారులకు ఇండ్లు దక్కకపోగా అక్రమంగా ప్రజా ప్రతినిధుల అధికారుల అండదండలతో అమాయక ప్రజలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారని సిపిఎం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం నిజాంపేట్ రాజీవ్ గృహకల్ప ఇండ్ల కబ్జాను నివారించే చర్యలు చేపట్టాలని వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో హౌసింగ్ బోర్డు అధికారులు కేటాయించని ఇండ్లకు సీలు వేసినప్పటికీ తాళాలు పగలగొట్టి కబ్జాదారులు కబ్జా చేసి అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు. బాచుపల్లి ఎమ్మార్వోకు సరేన్వ చేసి అసలైన లబ్ధిదారులకు కేటాయించాలని కోరినా పట్టించుకోవడంలేదని అన్నారు. వెంటనే రాజీవ్ గృహకల్ప ఇండ్ల కబ్జా అరికట్టి అసలైన లబ్ధిదారులకు కేటాయించే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

### నేరెడ్‌మెట్ పరిధిలో తల్లీకొడుకుల అదృశ్యం..

**నేరెడ్‌మెట్,ఆగస్టు02 ప్రభాతవార్త:** తల్లి, కుమారుడు అదృశ్యమైన సంఘటన నేరెడ్‌మెట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం నేరెడ్‌మెట్ పోలీస్టేషన్ పరిధిలోని చంద్రబాబు నాయుడు నగర్‌లో నివాసమండే కెతావత్ శివ తన భార్య కెతావత్ అంజలి, కుమారు కార్తిక్‌లతో కలసి నివాసముంటున్నాడు. ఈ క్రమంలో గత నెల 26వ తేదీన మధ్యాహ్నం 12:30గంటల సమయంలో ఇంట్లో ఎవ్వరికి చెప్పకుండా తన కుమారు కార్తిక్‌ను తీసుకొని వెళ్ళింది. సాయంత్రం అయినా తిరిగి ఇంటికి రాకపోవడంతో ఆందోళన చెందిన భర్త శివ తెలిసిన, బంధువుల ఇళ్ళలో వెతికినా ఆచూకి తెలియకపోవడంతో నేరెడ్‌మెట్ పోలీసులకు ఫిర్యాదు చేసాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

### శ్రీ అక్కన్న మాదన్న మందిరంలో కుంకుమార్చన

**చార్మినార్,ఆగష్టు 2 ప్రభాతవార్త :**

ఆషాడ మాసం నాలుగవ శుక్రవారం సందర్భంగా పాతబస్తీ హరిబౌలిలోని శ్రీ అక్కన్న మాదన్న మహంకాళీ మందిరంలో సామూహిక కుంకుమార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. పాతనగరంలోని పలు ప్రాంతాలకు చెందిన దాదాపు మూడు వందల మంది మహిళలు పాల్గొన్నారు.అనంతరం అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది.ఈ కార్యక్రమంలో మందిరం కమిటి ప్రతినిధులు పాల్గొన్నారు.

## 9, 10 తేదీలలో ఆదివాసీ హక్కులు-కార్పొరేటీకరణ'పై జాతీయ స్థాయి సదస్సు



కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ జి.హరగోపాల్. చిత్రంలో లక్ష్మణ్, నారాయణరావు, అన్వర్‌ఖాన్ తదితరులు

**సైఫాబాద్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** అంతర్జాతీయ ఆదివాసీ హక్కుల దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 9, 10 తేదీలలో బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో 'ఆదివాసీ హక్కులు-కార్పొరేటికరణ' అనే అంశంపై అఖిల భారత సదస్సు నిర్వహిస్తున్నామని ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక తెలిపింది. ఈ మేరకు శుక్రవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో సంఘీభావ వేదిక ప్రతినిధులు హక్కుల నేత ప్రొఫెసర్ జి.హరగోపాల్, తెలంగాణ పౌర హక్కుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ఎన్.నారాయణరావు, ప్రొఫెసర్ అన్వర్‌ఖాన్ తదితరులు ఈ సదస్సుకు సంబంధించిన కరపత్రాన్ని ఆవిష్కరించి మాట్లాడారు. 9వ తేదీన జరిగే సదస్సులో దేశంలోని ప్రముఖులు సిపిఐ జాతీయ ప్రధాన కార్యదర్శి డి.రాజా, ప్రొఫెసర్ మనోరంజన్, ప్రొఫెసర్ సరోజగిరి, సోనిసోరి, మాలిని సుబ్రాహ్మణ్యం, జస్టీస్ సుదర్శన్‌రెడ్డి అనురాధ, సురేపల్లి సుజాత, కల్పనా కన్నాభిరాన్, డి.నర్సింహ్మారెడ్డి తదితరులు పాల్గొని ప్రసంగిస్తారని వారు చెప్పారు. 10వ తేదీన బాగ్‌లింగంపల్లి నుంచి ఇందిరాపార్కు వరకు భారీగా ర్యాలీ జరుగుతుందన్నారు. ఆదివాసీలపై ప్రపంచ వ్యాప్తంగా విధ్వంసం, హక్కుల ఉల్లంఘన జరుగుతున్నదని ప్రొఫెసర్ జి.హరగోపాల్ ఆరోపించారు. ఇటీవల ఛత్తీస్‌ఘడ్ ముఖ్యమంత్రి బహిరంగంగా బస్తర్‌లోని ఖనిజాలను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తామని, దేశానికి సంపద సృష్టిస్తామని, అడవీలోని చెట్లను నరికివేసి మరొక చోట మొక్కలను నాటుతామని స్పష్టంగా ప్రకటించడం దారుణమన్నారు. ఆదివాసీలను ఎందుకు అణిచివేస్తున్నారని, వాతావరణాన్ని కాపాడుకోకుండా ఆదివాసీల పాదాల కింద ఉన్న ఖనిజాలను దోపిడీ చేయడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి నమూనా పేరిట ప్రజల హక్కులను హరించడం దారుణమన్నారు. ఆదివాసీలకు జరుగుతున్న అన్యాయాన్ని దేశంలోని విద్యావంతులు, మేధావులు, రాజకీయ నాయకులు, హక్కుల నేతలు వ్యతిరేకించాలని ఆయన పిలుపునిచ్చారు.

## బిజినెస్‌లోన్ పేరుతో రూ.కోటిన్నర మోసం..నిందితులు అరెస్ట్

**హైదరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** వ్యాపారులకు బిజినెస్ లోన్లు ఇప్పించే నెపంతో రూ.1.5కోట్లు మోసం చేసిన నిందితులని మాదాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. పట్టుబడ్డ నిందితుల్లో ప్రధాన నిందితుడు మహమ్మద్ సద్దాన్ అన్సారీ(33) కాగా, మరొకడు షాజీ అహ్మద్ సిద్ధిఖీ(45)గా గుర్తించారు. నిందితుల నుంచి 9 మొబైల్ ఫోన్లు, రెండు ల్యాప్ టాప్‌లు, 18 చెక్ పుస్తకాలు, మూడు కార్లు స్వాధీనం చేసుకున్నారు. గతంలో వీరిపై విశాఖపట్నం, ముంబై, హైదరాబాద్‌లలో 6 లోన్ చీటింగ్ కేసులు నమోదయినట్లు వెల్లడించారు. వీరు ముఠాగా ఏర్పడి వ్యాపారులను టార్గెట్ చేసి భారీ మొత్తంలో డబ్బులు దండుకుంటున్నట్లు పోలీసులు దర్యాప్తులో తేలింది. నిందితుల్లో మరో 11 మంది పరారీలో ఉన్నట్లు తెలిపారు. వారి పేర్లు, వివరాలు సేకరించిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. మాదాపూర్ పోలీసుల కథనం ప్రకారం, లక్నోకు చెందిన మహమ్మద్ సద్దాన్ అన్సారీ హోటల్ వ్యాపారంలో నష్టాలు రాగా, విలాసవంతమైన జీవితంతో పాటు దుర్వ్యసనాలకు అలవాటు పడ్డాడు. ఈ క్రమంలో అక్రమ ధనార్జనకు లోన్ల కొరకు నిరంతరం ప్రయత్నించే వ్యాపారులను టార్గెట్ చేశాడు. వారు ఇచ్చే కమీషన్లపై గురి పెట్టి, లోన్ల పేరుతో వరుస మోసాలకు పథకం వేశాడు. ఈ పథకంలో మరో 12 మందిని భాగస్వాములను చేసి, నకిలీ దందా మొదలు పెట్టాడు. అందుకు గానూ 2019లో ముంబైలోని ఖరీదైన బిల్డింగును అద్దెకు తీసుకుని మోసాలకు అనువుగా ఒక కార్యాలయాన్ని ప్రారంభించాడు. వ్యాపారుల ఫోన్ నెంబర్ల లిస్టును సంపాదించిన ఈ ముఠా, పలువురికి లోన్ల పేరుతో వల వేసింది. తమ వద్దకు వచ్చిన ఎందరో వ్యాపారులకు ముఠా సభ్యులు తమను తాము మీడియేటర్లుగా, కంపెనీ అసిస్టెంట్లుగా, పార్ట్‌నర్లుగా, అకౌంటెంట్లుగా, ఆఫీస్ ఉద్యోగులుగా పరిచయం సుకుని వరుస మోసాలకు పాల్పడ్డారు. ఈ క్రమంలో నిందితులు తమ కార్యకలాపాలు గోవాకు మార్చడంతో కొత్త కస్టమర్లు రావడం మొదలు పెట్టారు. ఈ తరుణంలో మాదాపూర్‌కు చెందిన కొడాలి శ్రీకాంత్ చౌదరికి తన సోలార్ బ్యాటరీ పరిశ్రమ అభివృద్ధికి గానూ ఒక ప్రైవేట్ బ్యాంక్ ద్వారా రూ.150కోట్లు లోన్ శాంక్షన్ చేయనున్నట్లు మభ్యపెట్టారు. కానీ లోన్ డబ్బు రాక మునుపే తమ కమీషన్ రూ.1.5కోట్లు బదిలీ చేయాలని తొందర పెట్టారు. అన్ని ఫార్మాలిటీలు పూర్తి చేసిన బాధితుడు, నిందితులు అడిగినంత డబ్బు పంపగా తనకి లోన్ రూపంలో ఎటువంటి నగదూ రాలేదు. తాను మోసపోయినట్లు ఆలస్యంగా గ్రహించిన బాధితుడు పోలీసులను ఆశ్రయించగా, సైబరాబాద్ కమీషనర్ అవినాశ్ మహంతి ఆధ్వర్యంలో రంగంలోకి దిగిన పోలీసులు ముఠాలోని ఇద్దరు నిందితులను అరెస్ట్ చేయగా 11 మంది పరారయ్యారు. ఈ మేరకు కేసు నమోదు చేసి నిందితులను కోర్టులో హాజరు పరిచారు.

## విచ్చలవిడిగా రోడ్లపై వాహనాల పార్కింగ్

**-పట్టించుకోని ట్రాఫిక్ పోలీసులు**



**అత్తాపూర్ ఆగస్టు2,ప్రభాతవార్త :** అత్తాపూర్‌లోని పలు హోటల్స్, ఆస్పత్రులకు రోడ్లు అక్రమ పార్కింగ్‌కు నిలయంగా మారిపోయింది. విచ్చలవిడిగా రోడ్లపై వాహనాలను నిలిపితే కఠిన చర్యలు తప్పవని ట్రాఫిక్ పోలీసులు చేపుతున్నప్పటికి అది అచరణలో మాత్రం కనిపించడంలో లేదు. అత్తాపూర్ నుండి అరంఘర్ వైపు వెళ్లే మార్గంలో రోజు వేలాది మంది ప్రయాణికులు ప్రయాణం సాగిస్తుంటారు. అయినప్పటికి పిల్లర్ నెంబర్146 దగ్గర హోటల్స్, ఆస్పత్రుల యజమాన్యాలు ఎలాంటి పార్కింగ్ సదుపాయాలు ఏర్పాటు చేయకపోవడంతో వాహనాదారులు ఇష్టమెచ్చినట్లు రోడ్లపై వాహనాలను గంటల తరబడి పార్కింగ్ చేస్తున్నారు.దీంతో ఆ రోడ్డులో వెళ్లే ప్రయాణికులకు ట్రాఫీక్ ఇక్కట్లు తప్పడం లేదు. ట్రాఫీక్స్ రూల్స్ ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని చేపుతున్నప్పటికి కళ్ల ముందు హోటల్స్, ఆస్పత్రుల ముందు వాహనాలు నిలిపిన పట్టించుకోవడం లేదని, వాహనాదారులు, స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తు న్నారు.ఇప్పటికైనా ట్రాఫీక్ పోలీసులు రోడ్లపై వాహనాలను నిలిపితే చర్యలు తీసుకోవాలని లేకుంటే ప్రయాణికులకు ఇక్కట్లు తప్పవని వాపోతున్నారు.

## చెస్ బాక్సింగ్‌ను ప్రభుత్వం ప్రోత్సహించాలి

**-తెలంగాణ కోచ్ తక్కడ్‌పల్లి ప్రతిభ**



తాము సాధించిన మెడల్స్‌తో రుషాంక్‌రెడ్డి, ప్రతిభ, విజయ్ రాఘవేంద్రరావు

**హైదరాబాద్,ఆగస్టు 2,ప్రభాతవార్త:**

చెస్ బాక్సింగ్ క్రీడను తెలంగాణ ప్రభుత్వం ప్రోత్సహించి చేయూతను అందించాలని చెస్‌బాక్సింగ్ తెలంగాణ కోచ్ తక్కడ్‌పల్లి ప్రతిభ ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ శారీరకంగా, మానసికంగా ధృడంగా ఉండేందుకు చెస్ బాక్సింగ్ క్రీడ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. గతనెల 26వ తేదీ నుంచి 30వ తేదీవరకు ఏషియన్ చెస్ బాక్సింగ్ ఛాంపియన్‌షిప్ అలాగే ఇండియన్ ఓపెన్ ఇంటర్నేషనల్ చెస్‌బాక్సింగ్ పోటీల్లో తెలంగాణ 10పథకాలు సాధించడం గర్వంగా ఉందన్నారు. సబ్ జూనియర్ విభాగంలో మాస్టర్ పోచారం రుషాంక్‌రెడ్డి (12), 2గోల్డ్ మెడల్స్, సీనియర్స్ విభాగంలో విజయ్ రాఘవేంద్రరావు (23) రెండు స్వర్ణపథకాలు, సీనియర్ మహిళా విభాగంలో ప్రతిభకు 5బంగారు పతకాలు, ఒకసిల్వర్ పథకం సాధించి తెలంగాణ రాష్ట్రానికి గుర్తింపు తేవడం జరిగిదన్నారు. అంతర్జాతీయ స్థాయిలో పథకాలు సాధించిన తమకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తించి సహకారం అందిస్తే ఇంకా ఎన్నో పథకాలు సాధిస్తామని ధీమా వ్యక్తం చేశారు. ఈఅంతర్జాతీయ పోటీలకు జపాన్, కెనడా, రష్యా, ఇండియా దేశాలకు చెందిన దాదాపు 250 మంది క్రీడాకారులు పాల్గొన్నారని ఆమె తెలిపారు.



సమావేశంలో మాట్లాడుతున్న మండల స్పెషల్ ఆఫీసర్ సైదులు,పాల్గొన్న ఎంపిడిఓ మమతాబాయి, ఎంపిఓ వినూత్న

## స్వచ్ఛదనం-పచ్చదనం విజయవంతం చేయాలి

### మండల స్పెషల్ ఆఫీసర్ సైదులు

**శామీర్‌పేట, ఆగస్టు 2, ప్రభాతవార్త**

రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 5 నుంచి 9వ తేదీ వరకు నిర్వహిస్తున్న స్వచ్ఛధనం-పచ్చదనం కార్యక్రమాన్ని గ్రామాల్లో విజయవంతం చేయాలని శామీర్‌పేట మండల స్పెషల్ ఆఫీసర్ సైదులు సంబంధిత అధికారులకు సూచించారు. శుక్రవారం శామీర్‌పేట మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఓ మమతాబాయి ఆధ్వర్యంలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంపై సమావేశం జరిగింది. ఈ సందర్భంగ పాల్గొన్న మండల స్పెషల్ ఆఫీసర్ సైదులు మాట్లాడుతూ ప్రభుత్వం నిర్వహిస్తున్న స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమాన్ని గ్రామాల స్పెషల్ ఆఫీసర్లు, పంచాయతీల కార్యదర్శులు, ఆశావర్కర్లు, మహిళా విఒలు కమిటీలు ఏర్పాటు చేసుకుని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజలను కూడ భాగస్వాములను చేయాలని అన్నారు. ఈ నెల 5నుంచి 9వరకు రోజువారీగ కార్యక్రమాలు ఉంటాయని అందరు పాల్గొని విజయవంతం చేయాలని ఆయన సూచించారు. ఈ సమావేశంలో ఎంపిడిఓ మమతాబాయి, ఎంపిఓ వినూత్న, వివిధశాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఆశావర్కర్లు, మహిళా సంఘాల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ



బాధితులకు సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ చేసిన టిపిసిసి ఉపాధ్యక్షులు తోటకూర వజ్రేశ్‌యాదవ్,పాల్గొన్న నాయకులు బి.నర్సింలుయాదవ్, ఎం,శ్రీనివాస్‌రెడ్డి,తదితరులు

**శామీర్‌పేట, ఆగస్టు 2, ప్రభాతవార్త** కొల్తూర్ గ్రామానికి చెందిన బాధితులు అంజనేయులుకు, సవితకు సిఎం రిలీఫ్‌ఫండ్ ఆర్థిక సహాయం 96,500రూపాయలు ఆ ఇద్దరికి మంజూరు కావటంతో వారి కుటుంబ సభ్యులకు చెక్కులను టిపిసిసి ఉపాధ్యక్షులు,మేడ్చల్ నియోజకవర్గకాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి తోటకూర వజ్రేశ్‌యాదవ్ అందజేశారు. శుక్రవారం మూడుచింతలపల్లి మండలంలోని కొల్తూర్ గ్రామానికి చెందిన టి.అంజనేయులు, జి.సవిత ఇద్దరు కూడ అనారోగ్యంతో ఉండి ఆసుపత్రిలో చికిత్స కోసం చేరటంతో ప్రభుత్వం సిఎం రిలీఫ్‌ఫండ్ నుంచి వైద్య ఖర్చుల కోసం రూపాయలు మంజూరు కావటం జరిగిందన్నారు. కొల్తూర్‌కు చెందిన బాధితులు టి.అంజనేయులుకు 41,500రూపాయలు, జి.సవితకు 55,000 వేల రూపాయలు ఆర్థిక సహాయంగ ముంజూరైనట్లు ఆయన తెలిపారు. వారి కుటుంబ సభ్యులకు ఆర్థిక సహాయంగ చెక్కులను అందజేయటం జరిగిందన్నారు. సిఎం సహాయ నిధి ఆపద కాలంలో ఆదుకోవటానికి దోహదపడుతుందని, నిరుపేదలకు ఆసరాగా ఉంటుందని వజ్రేశ్‌యాదవ్ అన్నారు. పేదలకు ప్రభుత్వం అండగా ఉంటుందని ఆయన తెలిపారు. బాధితులకు ఆర్థిక సహాయం మంజూరు చేయించినందుకు తోటకూర వజ్రేశ్‌యాదవ్‌కు మూడుచింతలపల్లి మండల కాంగ్రెస్ అధ్యక్షులు బి.నర్సింలుయాదవ్, మాజీ వైస్‌ఎంపిపి ఎం.శ్రీనివాస్‌రెడ్డిలు దన్యవాదాలు తెలిపారు. దీనిలో వారితో పాటు పలువురు నాయకులు పాల్గొన్నారు.

## ఘనంగా గ్రామదేవతకు బోనాలు



అప్పాయిపల్లిలో పోచమ్మ అమ్మవారికి బోనాలతో మొక్కులు చెల్లిస్తున్న గ్రామస్థులు

**కొడంగల్,ఆగష్టు 2ప్రభాతవార్త** కొడంగల్ మండల పరిధిలోని అప్పాయిపల్లి గ్రామంలో పోచమ్మ గ్రామదేవతకు గ్రామస్థులు బోనాల ఊరేగింపు నిర్వహించారు.శుక్రవారం గ్రామంలోని మహిళలు తలపై బోనాలతో డప్పు చప్పుల మధ్య ఆలయానికి చేరుకొని ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు.అనంతరం తమ ఇష్ట దైవమైన పోచమ్మతల్లికి నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.వర్షాలు సమృద్ధిగా కురుస్తు పంటలు బాగా పండి పిల్లాపాపలను చల్లంగా చూసేలా ఆశీర్వదించాలని అమ్మవారికి మొక్కులు చెల్లించారు.

## కృతజ్ఞతా సభకు తరలిన ఉపాధ్యాయులు

**జహీరాబాద్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** హైద్రాబాద్‌లో నిర్వహిస్తున్న ఉపాధ్యాయుల కృతజ్ఞత సభకు నియోజకవర్గంలోని ఆయా పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు శుక్రవారం కలిసి కట్టుగా తరలివెళ్లారు. రాష్ట్రంలో పని చేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు, బదిలీలు చేస్తూ ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసినందుకు కృతజ్ఞతగా హైద్రాబాద్‌లోని లాల్ బహదూర్ స్టేడియంలో నిర్వహించే కృతజ్ఞత సభకు ముఖ్య అతిథిగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి హాజరయ్యే సభకు ఉపాధ్యాయులు పిఆర్‌టియు టిఎస్ జహీరాబాద్ అధ్యక్షులు తులసిరామ్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి శ్రీశైలం, రాష్ట్ర ఉపాధ్యక్షులు నాగయ్య స్వామి, అర్జున్ చౌహాన్, నాయకులు శివరాజ్, పిఇ సత్యనారాయణ, వెంకటేశం, గోవర్ధన్, బాబు, సత్వార్ హెచ్‌ఎం బస్వరాజ్, జహీరాబాద్ ఎంఈఓ బస్వరాజ్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు తరలివెళ్లారు.

## వీరభద్ర స్వామికి నెల రోజుల పాటు అభిషేకాలు

**కొల్చారం, ఆగస్టు 2 ప్రభాతవార్త:** మండల కేంద్రంలోని భద్రకాళి సమేత వీరభద్ర స్వామి ఆలయంలో శ్రావణమాసం పురస్కరించుకొని సోమవారం నుండి వీరభద్ర స్వామి ఆలయంలో ప్రతిరోజు నెల రోజులపాటు ఆలయంలో స్వామివారికి అభిషేకం, అర్చన, పూజలు నిర్వహించడం జరుగుతుందని వీరభద్ర ఆలయ కమిటీ సభ్యులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ఎమ్మార్పీఎస్ నాయకుల సంబరాలు

**గుమ్మడిదల, ఆగస్టు2 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నాయకులు శుక్రవారం మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాప కులు మందకృష్ణ మాదిగకు మద్ధతుగా మాదిగ దండోరా ఉద్యమం(ఎస్సీ, ఎస్టీ) ఏబీసీడీ వర్గీకరణ కోసం 30 సంవత్సరాల పోరాటం ఫలితం కారణంగా గురు వారం ఇచ్చిన సుప్రీంకోర్టు తీర్పు ఎంతో గొప్పదని హర్షం వ్యక్తం చేశారు.

# విద్యార్థులపై ఆర్టీసీ అధికారుల వివక్ష

**ధనార్జనే ధ్యేయంగా బస్సులు నడుపుతున్న ఆర్టీసీ అధికారులు**
**సమయానుకూలంగా బస్సులు లేక విద్యార్థుల అవస్థలు**
**పట్టించుకోని ఉన్నతాధికారులు**



బస్సు ఎక్కేందుకు పరుగులు తీస్తున్న విద్యార్థులు

**వికారాబాద్,ఆగస్టు 2, ప్రభాతవార్త:** మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం రాష్ట్ర ప్రభుత్వం అమలు పరిచినప్పటి నుంచి పాఠశాల, కళాశాల విద్యార్థుల కష్టం వర్ణనాతీతంగా మారింది. పాఠశాల, కళాశాలలకు వెళ్ళే విద్యార్థులు ఆర్టీసీ బస్సు ఎక్కాలంటేనే సాహసంగా మారింది. దీనికి తోడు పాఠశాల సమయ పాలనలో రాష్ట్ర ప్రభుత్వం మార్పులు తేవడంతో విద్యార్థుల బస్సు ప్రయాణం మరింత భారంగా తయారైంది. పాఠశాలలు ఉదయం 9.15 గంటలకే ప్రారంభం కావడంతో ఉదయం వేళల్లో ఆర్టీసీ బస్సులు రాకపోవడంతో విద్యార్థులు ఆపసోపాలు పడాల్సిన పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా వికారాబాద్ జిల్లా కేంద్రంలోని ఆర్టీసీ డిపో వారు పాఠశాల సమయ పాలనకు తగ్గట్లుగా బస్సులు నడుపకపోవడంతో విద్యార్థులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వికారాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ బదిలీ పై కొత్తగా రావడంతో కంట్రోలర్ విధుల్లో ఉండే ఆర్టీసీ అధికారులు ఆడిందే ఆట..పాడిందే పాట అన్న చంధంగా తయారైంది. ఉదయం 7.30 గంటల నుంచి 9 గంటల వరకు విద్యార్థులు వికారాబాద్ బస్టాండ్‌లో వేచి ఉన్న ఒక్కటంట..ఒక్కటి ఆర్డినరీ బస్సు రాకపోవడంతో పాఠశాల సమయం దాటి పోతుందని విద్యార్థులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు. వికారాబాద్-హైదరాబాద్ మార్గంలో ఉన్న పూడూరు మాడల్ స్కూల్ కి వికారాబాద్ నుంచి ప్రతినిత్యం దాదాపు 150 మంది విద్యార్థులు ఆర్టీసీ బస్సులో వెళ్తుంటారు. అదే మార్గంలో ఉన్న శివారెడ్డిపేట్, ఎన్నెపల్లి ప్రభుత్వ పాఠశాలలకు వెళ్ళే విద్యార్థులు, చేవెళ్ల, మొయినాబాద్ పరిధిలోని కళాశాలలకు వెళ్ళే విద్యార్థులు ఉదయం వేళల్లో ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణిస్తుంటారు. వికారాబాద్ నుంచి హైద్రాబాద్ వైపు ఎక్స్‌ప్రెస్ బస్సులు వెళ్తున్నప్పటికీ, విద్యార్థుల బస్సు పాస్‌లను అనుమతించకపోవడంతో ఆర్డినరీ బస్సుల కోసం విద్యార్థులు గంటల తరబడి వేచి ఉంటున్నారు. విద్యార్థులకు ఫ్రీ సర్వీసు ఇస్తే సంస్థకు ఎలాంటి లాభం లేదని భావించిన ఆర్టీసీ అధికారులు విద్యార్థులను చిన్న చూపు చూస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. విద్యార్థులు ఉదయం వేళల్లో బస్టాండ్‌లో వేచి ఉన్నప్పటికీ బస్టాండ్‌లో కి వచ్చిన ఆర్డినరీ బస్సులను ప్లాట్ ఫామ్ పై ఉంచకుండా, పక్కకు గంటల తరబడి నిలిపుతున్నారు. 9 గంటలు గడిచిని ఆర్డినరీ బస్సులు ప్లాట్ ఫామ్ పైకి రాకపోవడంతో, పాఠశాల సమయం దాటిపోతుందని భావించిన కొందరు విద్యార్థులు ప్రైవేటు వాహనాల్లో వెళ్ళిపోవడం జరుగుతుంది. ఇది గమనించిన కంట్రోలర్ స్థాయి అధికారి, విద్యార్థుల రద్దీ తక్కువైందని, మిగతా వారు బస్సు ఎక్కితేనే ఆర్టీసీ కి లాభం వస్తుందని, బస్సుకు హైదరాబాద్ బోర్డు వేసుకుని వెళ్ళాల్సిందిగా బస్సు డ్రైవర్, కండక్టర్లకు సూచిస్తున్నారు. దీంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆర్టీసీ అధికారుల తీరుపై పెదవి విరుస్తున్నారు. ఈ విషయాన్ని కొత్తగా వచ్చిన డిపో మేనేజర్ దృష్టికి తీసుకెళ్ళిన పట్టిపట్టనట్లు వ్యవహరిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు పేర్కొంటున్నారు.

### సమయానుకూలంగా ఆర్టీసీ బస్సులు నడపాలి

**శ్రీదేవి, పూడూరు మాడల్ స్కూల్ ప్రిన్సిపల్**

పాఠశాల సమయానుకూలంగా వికారాబాద్ ఆర్టీసీ డిపో అధికారులు బస్సులను నడపాలి, ఉదయం, సాయంత్రం వేళల్లో ఆర్టీసీ బస్సులు సమయా నుకూలంగా రాకపోవడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారు. పాఠశాల సమయం ఉదయం 9-15 గంటల నుంచి సాయంత్రం 4.15 గంటల వరకు ఉంటుందని, ఈ సమయాల్లో విద్యార్థులకు అనుకూ లంగా బస్సులు నడిపేందుకు ఆర్టీసీ అధికారులు కృషి చేయాలని పాఠశాల ప్రిన్సిపల్ శ్రీదేవి కోరారు. కొన్ని సార్లు స్కూల్ బస్టాప్ వద్ద బస్సులు నిలుపకుండా వెళ్తున్నారని, అలా చేయడంతో విద్యార్థులు ప్రైవేటు వాహనాల్లో ఇళ్లకు వెళ్తున్నారని తెలిపారు. పాఠశాల సమయాల్లో బస్సులు నడిపేలా వికారాబాద్ ఆర్టీసీ డిపో అధికారులు చర్యలు చేపట్టాలని ఆమె కోరారు.

### ప్రైవేటు బస్సులు రద్దు కావడంతో ఈ సమస్య

**జి.అరుణ, వికారాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్**

గతంలో ఉన్న ప్రైవేటు బస్సులు రద్దు కావడంతో ఈ సమస్య తలెత్తుతుందని, త్వరలోనే సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని వికారాబాద్ ఆర్టీసీ డిపో మేనేజర్ జి.అరుణ వివరణ ఇచ్చారు. పాఠశాల, కళాశాల విద్యార్థుల సమయానుకూలంగా బస్సులు నడుపుతామని స్పష్టం చేశారు. బస్ స్టాప్‌లు ఉన్న ప్రతి చోట ఆర్డినరీ బస్సులు నిలిపేలా బస్సు డ్రైవర్లు, కండక్టర్లకు ఆదేశాలివ్వడం జరిగిందని పేర్కొన్నారు. బస్సులు నిలపని పక్షంలో సంబంధిత బస్సు డ్రైవర్‌పై శాఖ పరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కీసరలో హెరిటేజ్ పాడి రైతులకు అవగాహన కల్పిస్తున్న తెలంగాణ రీజనల్ హెడ్ వరప్రసాద్

## హెరిటేజ్ పాడి రైతులకు అవగాహన సదస్సు

**కీసర,ఆగస్టు2,ప్రభాతవార్త:** హెరిటేజ్ పాడి రైతులకు అవగాహన సదస్సును శుక్రవారం మండల కేంద్రమైన కీసరలో నిర్వహించడం జరిగింది.తెలంగాణ రీజినల్ హెడ్ వరప్రసాద్ మాట్లాడుతూ పాడి రైతులు పశుపోషణ ఏ విదంగా నిర్వహిస్తున్నారని రైతులను అడిగి తెలుసుకున్నారు.దానికి కావాల్సిన దానా మినరల్ మిక్సర్ కాల్షియం నట్టల నివారణ మందులు ఎలా వాడాలో రైతులకు వివరించారు.రైతులకు ఉచితంగా ప్రమాద భీమా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.పశువులకు ఇన్సూరెన్స్ ప్రతి శిశువుకు 300 రూపాయల సబ్సిడీ ఇవ్వడం జరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఘట్‌కేసర్ బిఎంసి మేనేజర్ ఎలగందుల బాలక్రిష్ణ,సెంటర్ ఏజెంట్ ముద్దం దయానంద్,పాడి రైతులు రాజు,మల్లేష్,ప్రవీణ్,బాలక్రిష్ణ,బిక్షపతి,మల్లారెడ్డి,నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

## 30 సంవత్సరాల కల నెరవేరింది



అంబేద్కర్ విగ్రహనికి,మంద క్రిష్ణ మాదిగ చిత్ర పటాలకు పాలాభిషేకం చేస్తున్న అంబేద్కర్ సంఘం నాయకులు

**కీసర,ఆగస్టు2,ప్రభాతవార్త:** ఎస్సీ వర్గీకరణ 30 సంవత్సరాల సుదీర్గ ఏబిసిడి వర్గీకరణ ఉద్యమం మంద క్రిష్ణ మాదిగ అలుపెరుగని పోరాటంతోనే సాధ్యపడిందని మండల అంబేద్కర్ సంఘం అధ్యక్షులు కొమ్ము శ్రీనివాస్,ప్రధాన కార్యదర్శి తుడుం శ్రీనివాస్ తెలిపారు.శుక్రవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహనికి,మంద క్రిష్ణ మాదిగ చిత్ర పటానికి పాలాభిషేకం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జస్టిస్ చంద్రచూడ్ నేతృత్వంలో ఏర్పడిన ధర్మాసనం షెడ్యూల్ కులాల,షెడ్యూల్ తెగలు ఏబిసిడి వర్గీకరణ రాష్ట్ర ప్రభుత్వానికి హక్కు కల్పించడం 30 సంవత్సరాల మంద క్రిష్ణ మాదిగ సుదీర్ఘ పోరాట ఫలితమే అన్నారు.ఎస్సీ వర్గీకరణ అంశంపై సుప్రీంకోర్టులో ఏడుగురు ధర్మాసనం షెడ్యూల్ తెగల ఏబిసిడి వర్గీకరణకు సానుకూలంగా తీర్పు ఇచ్చినందుకు 30 సంవత్సరాల సుదీర్ఘ పోరాటం విజయ తీరాలకు చేరుకున్నందుకు హర్షం వ్యక్తం చేశారు.వర్గీకరణ కోసం కాకుండా ఆరోగ్య శ్రీ పలాలు,వికలాంగుల వృద్దుల పెన్షన్,చిన్న పిల్లల గుండె జబ్బుల ఆపరేషన్ కోసం సమాజంలో అనేక పోరాటాలకు శ్రీకారం చుట్టి ఈ రోజు షెడ్యూల్ కలాల షెడ్యూల్ తెగల ఉద్యోగ ప్రమోషన్లకై మాదిగ ఉపకులాలు నాయకత్వంలో 25 శాతం జనాభాకు వర్గీకరణ సహకారమైందన్నారు.ఈ కార్యక్రమంలో ఎంఆర్‌పిఎస్ నాయకులు పాల్గొన్నారు.

## రైతు బీమాను సద్వినియోగం చేసుకోవాలి

**కల్హేర్, ఆగస్టు 2 ప్రభాతవార్త:** ప్రభుత్వం ప్రవేశపెట్టిన రైతు బీమా పథకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి నర్సింహారావు అన్నారు.శుక్రవారం కల్హేర్ రైతువేదికలో రైతుబీమా పథకానికి ఆన్‌లైన్లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన రైతులకు సూచించారు. కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకం కలిగినవారు, 18 సంవత్సరాల నుంచి 59 సంవత్సరాలు కలిగిన రైతులు నామిని వివరాలతో ఈనెల 5వ తేది వరకు దరఖాస్తులు చేసుకోవాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో ఏఓ శ్రీకాంత్, ఏఈఓలు సంతోష, సతీష్, రైతులు పాల్గొన్నారు.

## రైతు బీమా పత్రాలు స్వీకరించిన ఏఓ

**ఝరాసంగం, ఆగస్టు 2, ప్రభాతవార్త:** రైతుల నుంచి రైతుబీమాకు ధరఖాస్తులను శుక్రవారం మండల వ్యవసాయ అధికారి వెంకటేశం స్వీకరిం చారు. ఈ సందర్భంగా ఏఓ వెంకటేశం మాట్లాడుతూ జూన్ 28వ తారీఖు వరకు కొత్త పట్టాపాసు పుస్తకాలు అందుకున్న రైతులు గతంలో రైతు భీమా కొరకు ధరఖాస్తులు చేసుకోని రైతులు ఈ నెల 5వ తేదీవరకు ధరఖాస్తులు అందచేయాలని సూచించారు.



మున్సిపాలిటీ 8వ వార్డులో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి

## నాగారం మున్సిపాలిటీ అభివృద్ధే లక్ష్యం

**కీసర,ఆగస్టు2,ప్రభాతవార్త:** నాగారం మున్సిపాలిటీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు.శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులోని ఎస్వీనగర్ కాలనీలో మున్సిపల్ సాదారణ నిధులు 6.5 లక్షల రూపాయలతో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ మేడ్చల్ నియోజకవర్గంలో మున్సిపాలిటీని నంబర్‌వన్ స్దానంలో ఉంచుతానన్నారు.మున్సిపాలిటీలోని అన్ని వార్డులను అభివృద్ధి పథంలో నడిపించడానికి కృషి చేస్తానని అన్నారు.కాలనీ ప్రజలకు మౌళిక సదుపాయాలు కల్పించడమే తన లక్ష్యమన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు కౌకుట్ల మమత క్రిష్ణారెడ్డి,బిజ్జ శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్యదర్శికి సన్మానం



**బొంరాస్‌పేట్,ఆగస్టు2,ప్రభాతవార్త :** దుద్యాల్ మండలం ఈర్లపల్లి గ్రామ పంచాయతీ కార్యదర్శిగా పనిచేసిన ఎం ప్రభాకర్,సంత్రాకుంటతాండ కార్యదర్శి పి నరేందర్‌కు శాలువ పూలదండలతో నూతనంగా వచ్చిన కార్యదర్శులు సూర్యప్రకాశ్,కిసాన్,గ్రామప్రజలు ఘనంగా సన్మానం నిర్వహించారు. గత ఐదు సంవత్సరాలుగా వారు సమర్థవంతంగా విధులు నిర్వహించి బదిలీపై వెళ్లడంతో ఈ సన్మానం నిర్వహించడం జరిగింది.ఈ కార్యక్రమంలో రవినాయక్,మొగులయ్య, పెంటప్ప, వెంకటయ్య, గ్రామయువకులు, గ్రామప్రజలు పాల్గొన్నారు.

## వృధాగా పోతున్న మిషన్ భగీరథ నీరు

**కంది, ఆగస్టు 2, ప్రభాతవార్త:** మిషన్ భగీరథ నీరు లీకేజి అవుతున్నా ఎక్కడ లీకేజి అవుతుందో అధికారులు గుర్తించకలేకపోతుండటంతో తాగు నీరు నిత్యం వృధాగా రోడ్డుపై పారుతోంది. ఇందుకు సంబంధించి పూర్తి వివరాల్లోకి వెళితే...పాత కందికు సరఫరా అవుతున్న మిషన్ భగీథర నీరు పైప్‌లైన్ లీకేజీ మూలంగా తాగునీరు రోడ్డుపై వృధాగా పారుతోంది. వర్షాకాలంలో పైప్‌లైన్ లీకేజి అయితే వెంటనే మరమ్మతులు చేయాల్సి ఉండగా అధికారులు అవేమి పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతో తాగు నీరు వృధా కావడంతో పాటు కలుషిత నీరు సరఫరా అవుతోంది. కలుషిత నీరు తాగి తామెక్కడ అనారోగ్యానికి గురవుతామోఅన్న భయంలో గ్రామస్థులు కాలం గడుపుతున్నారు. ఈ విషయమై పంచాయితీ కార్యదర్శి విద్యాధర్ దృష్టికి ప్రభాతవార్త తీసుకుపోగా పైప్‌లైన్ లీకేజి కారణంగా నీరు వృధా అవుతున్న విషయం వాస్తవమే అని, అయితే లీకేజి ఎక్కడ జరుగుతుందో గుర్తించలేకపోతున్నామని, లీకేజిని గుర్తించిన వెంటనే మరమ్మత్తు పనులు చేయిస్తామని కార్యదర్శి విద్యాధర్ వివరణ ఇచ్చారు.

## మునిపల్లిలో రైతులకు అన్నదానం

**మునిపల్లి, ఆగస్టు 2,ప్రభాతవార్త:** రైతు రుణమాఫీని పురస్కరించుకుని మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన రైతులు మండల కేంద్రంలోని బ్యాంకు, వ్యవసాయ కార్యాలయానికి వచ్చే రైతులకు కాంగ్రెస్ నాయ కులు, రైతు నరేందర్‌గౌడ్ అన్నదానం సౌకర్యం కల్పిస్తున్నారు. 12 రోజు లుగా మునిపల్లిలో రైతులకు అన్నదానం ఏర్పాటు చేసినట్లు, రైతులు సద్వినియోగం చేసుకోవాలని నరేందర్‌గౌడ్ సూచిస్తున్నారు.

## సిఎం చిత్రపటానికి కాంగ్రెస్ క్షీరాభిషేకం

**నారాయణఖేడ్ టౌన్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** ఎస్సీ,ఎస్టీ వర్గీకరణపై సుప్రిం కోర్టు ఇచ్చిన తీర్పును స్వాగతిస్తూ శాసన సభలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రిజర్వేషన్‌ల అమోదుకు మద్దతు పలకడంతో నారాయణఖేడ్ ఎస్సీ సెల్ నాయకులతో కలిసి డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి సిఎం చిత్ర పటానికి శుక్రవారం పాలాభిషేకం చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి

## స్వచ్ఛదనం-పచ్చదనం జయప్రదం చేయండి: మర్రి నిరంజన్ రెడ్డి

**ఆదిభట్ల ఆగస్టు 2,ప్రభాతవార్త :** తెలంగాణ ప్రభుత్వం ఈనెల 5వ తేది నుండి 8వ తేది వరకు చేపట్టబోయే స్వచ్ఛదనం పచ్చదనం కార్యక్రమం ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో కూడా విజయవంతం చేయాలని ఆదిభట్ల మున్సిపల్ చైర్మన్ మర్రి నిరంజన్ రెడ్డి పిలుపు నిచ్చారు.పురపాలక సిబ్బందిని కూడా ఈ కార్యక్రమంలో పాల్గొనవలసిందిగా ఆదేశించడం జరిగిందని మున్సిపాలిటీ పరిధిలో చెత్తచెదారం తొలగించడం మొక్కలు నాటడం సీజనల్ వ్యాధుల నివారణ చర్యలు చేపట్టడం వాటి కార్యక్రమాలు చేయాలని కోరారు.మంచినీటి సరఫరా ప్రతిష్టంగా చేపట్టడం,రోడ్లపై ఏర్పడిన గుంతలను పూర్చడం ,ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్య కార్యక్రమం నిర్వహించడం వంటి కార్యక్రమాలు నిర్వహించబోతున్నామని తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు పురపాలక సిబ్బంది సహాయక సిబ్బంది మహిళలు గ్రామస్తులు యువకులు అధికంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ సిబ్బంది కమిషనర్ బాలకృష్ణ ,మున్సిపల్ ఇంజనీర్ వీరాంజనేయులు ప్రిన్సిపల్ మేనేజర్ రమేష్,మున్సిపల్ కార్యాలయం సిబ్బంది,కౌన్సిలర్లు, తదితరులు పాల్గొన్నారు.

## ఫార్మాసిటిపైన స్పష్టత లేదు

### రైతుల్లో అసంతృప్తి : ఫార్మా వ్యతిరేక పోరాట కమిటీ

**యాచారం ఆగస్టు2,ప్రభాతవార్త :** ఫార్మాసిటి రద్దు అనగానే ఉవ్వెత్తున ఎగిసిపడి భూ సేకరణలో భూమి ఇవ్వని రైతుల అందరూ కలిసి సిఎంకి పాలాభిషేకం చేసి సంతోష పడ్డారని కానీ నేడు నిరాశ కలిగించే విధంగా ప్రభుత్వం వ్యవహరిస్తుందని తాడిపరినత మాజీ సర్పంచ్ దూస రమేష్ ఆవేదన వ్యక్తం చేశారు.శుక్రవారం రమేష్ విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ...ఫార్మా భూసేకరణ ప్రతిపాదిత ప్రాంతంలో మెగాటౌన్‌షిప్ ఏర్పాటు చేస్తాం,శాటిలైట్ టౌన్లు అవసరం అని చెప్పారు. అయిన అభివృద్ధే కదా అనుకున్నాం,ఇంకో కొన్ని రోజుల తర్వాత ఫార్మాసిటీ కాదు,అక్కడక్కడ ఆర్ఆర్ఆర్ చుట్టు ఫార్మా విలేజ్ పెడతాం అంటే మా వద్దకు రావు కదా అనుకున్నాం మొన్న అక్కడక్కడ చిన్న చిన్న గోలీలు తయారు చేస్తాం,జపాన్ కంపెనీకి 1200 ఎకరాల్లో ఎ1 ఏర్పాటు చేస్తాం,ఎలక్ట్రానిక్ హబ్ ఏర్పాటు చేస్తాం,మెడికల్ హబ్ చేస్తాం,యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం,స్కూల్ ఏర్పాటు చేస్తాం అన్నారు.నిన్న అసెంబ్లీలో కరోనా టీకాలు తయారు చేసింది హైదరాబాద్ అని ఆర్,డి సింతేసిస్ చేయుటకు ముందుకు వెళ్లాం, స్కిల్ యూనివర్సిటీ ఏర్పాటు చేస్తాం,స్పోర్ట్స్ ,క్రికెట్ మైదానాలు అని చెప్పారు.ఇప్పుడు స్కిల్ యూనివర్సిటికి శంకుస్థాపనలు చేశారు. ఇన్నిసార్లు అనేక పదాలతో మీడియాతో మాట్లాడుతూ.. ప్రభుత్వం ఉద్దేశ్యం తెలియచేస్తున్నారు.కానీ రైతులకు రిజిస్ట్రేషన్ హక్కులు కల్పిస్తామని రైతుల తరపున ఎందు మాట్లాడడం లేదని డిమాండ్ చేశారు.వెంటనే రాష్ట్ర ప్రభుత్వం ఫార్మాసిటీపై స్పష్టత ఇవ్వాలని కోరారు.

## యాచారంలో తల్లిపాల వారోత్సవాలు



యాచారం గ్రామంలో తల్లిపాల వార్షికోత్సవాలు నిర్వహిస్తున్న దృశ్యం

**యాచారం ఆగస్టు2,ప్రభాతవార్త :** యాచారం మండల కేంద్రాల్లో గల అంగన్‌వాడీలో శిశు సంక్షేమ జిల్లా అధికారి పద్మజారమణ ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవం కార్యక్రమాను ప్రారంభించారు.ఈ కార్యక్రమానికి పద్మాజా రమణ,ఎంపిడివో నరేందర్ రెడ్డి అతిథిగా హాజరై మాట్లాడారు....గర్భవతులు ,బాలింతలకు శిశువులు,చిన్నపిల్లల మనుగడ, పోషణ ,అభివృద్ధికి తల్లుల ఆరోగ్యానికి తల్లిపాలు చాలా కీలకం,తల్లి పాలు నవజాత శిశువులను అంటువ్యాధుల నుండి రక్షిస్తుంది. రోగనిరోధక శక్తిని పెంపొందించడంలో సహాయపడుతుంది.జీర్ణక్రియను సరైన ఎదుగుదలకు ఉపయోగపడుతుందన్నారు.బిడ్డల సాన్నిహిత్యాన్ని మెరుగుపరుస్తుందని తల్లీతో ప్రత్యేక్ష శారీరక సంబందాలు భద్రతా భావానికి ,మానసిక సామాజిక అభివృద్ధికి దోహదం చేస్తాయని అన్నారు.ఒక బిడ్డ మరోవైపు పాలిచే తల్లులకు రోమ్ము క్యాన్సర్ వచ్చే అవకాశం తక్కువ మరియు వారి శారీరక ఆర్యోగాన్ని శరీర ఆకృతిని సులభంగా తిరిగి తీసుకురావచ్చు.ప్రసవించిన తర్వాత,మొదటి ఆరు నెలల్లో శిశువుకు ప్రత్యేకంగా తల్లిపాలు ఇవ్వాలని తెలియజేశారు.6 నెలలు నిండిన పిల్లలకు అన్న ప్రాసన ,అక్షరాభ్యాసం చేపించి,తల్లి పాలు పిల్లలకు ప్రాముఖ్యత గురించి వివరించారు.ఈ కార్యక్రమంలో మండల అంగన్‌వాడీ టీచర్స్ పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు కలగకుండా రుణమాఫీ చేయండి

**సదాశివపేట, ఆగస్టు 2, ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేసినందున బ్యాంకుల్లో పేర్లు, చిరునామాల్లో తప్పిదాలు ఉంటే సరిచేసి రుణాల మాఫీని పూర్తి చేసి అవసరమైన వారికి వెంటనే కొత్త రుణాలను మంజూరు చేయాలని తెలంగాణ మంజీరా రతు సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు పృథ్వీరాజ్ సూచించారు. శుక్రవారం పట్టణంలోని కార్యాలయం లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో తుమ్మలపల్లి పృథ్వీరాజ్ సమాఖ్య నాయకులు, రైతులు ఎం.సంగీశెట్టి, వెంకట్‌రావు, విశ్వేశ్వర్, వీరన్న, శివన్న తోకలిసి మాట్లాడుతూ వ్యవసాయాధికారులు బ్యాంక్ అధికారులు సమన్వయం తో తప్పులు దొర్లితే సరిచేసి రైతులకు న్యాయం చేయాలని సూచించారు.

## హద్నూర్‌లో 4న శ్రీమహంకాళి బోనాల వేడుకలు

**న్యాల్‌కల్, ఆగస్టు 2, ప్రభాతవార్త:** మండలంలోని హద్నూర్ గ్రామంలో ఆషాడ మాసాన్ని పురస్కరించుకుని శ్రీమహంకాళి ఆలయం ఈనెల 4వ తేదీన నిర్వహించే బోనాల ఉత్సవాలకు ఆలయం ముస్తాబవుతోంది. ఆషాడ మాసంలో చివరి ఆదివారం అమ్మవారికి బోనాలు నిర్వహిచడం గ్రామంలో ఆనవాయితీగా వస్తోంది.ఇందులో భాగంగా ఈనెల 4వ తేదీన అమ్మవారికి బోనాలు నిర్వహించేందుకు ఆలయాన్ని రంగులతో అద్ది ముస్తాబు చేస్తున్నారు. బోనాల ఉత్సవాలకు గ్రామ ఆడపడుచులను కుటుంబాల వారు ఈ పాటికే ఆహ్వానించారు. ఆత్తారింటి నుంచి పుట్టింటికి ఆడపడుచులు తమ పిల్లా పాపలతో రావడంతో గ్రామం సందడిగా మారుతుంది.

## గంజాయిని నిర్మూలిద్దాం-ఆరోగ్యంగా జీవిద్దాం

### -పోస్టర్‌ను ఆవిష్కరించిన సిఐ మహేష్‌గౌడ్

**సదాశివపేట, ఆగస్టు 2, ప్రభాతవార్త:** యువత గంజాయి డ్రగ్స్ మహ మ్మారికి దూరంగా ఉండాలని సిఐ మహేష్‌గౌడ్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని పోలీసు ఠాణాలో డ్రగ్స్ అవగాహన సదస్సుకు సంబంధించి వాల్ పోస్టర్‌ను సిఐ అవిష్కరించి ప్రసంగించారు. డ్రగ్స్ మాఫియాను అం తం చేయడానికి పోలీసులకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకరించాలని సూచించారు. పట్టణంలోని భవిత జూనియర్ కళాశాలలో ఈ నెల 3వ తారీఖున డ్రగ్స్‌పై విద్యార్థులకు అవగాహన సదస్సును నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.